

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం వాయిదా

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల పదిన జరగాల్సిన జీవీఎంసీ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్టు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ వరద ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం జీవీఎంసీ కమిషనర్‌తో పాటు అధికారులు, 1,500 మంది సిబ్బంది వెళ్లారు. వీరంతా మరో నాలుగైదు రోజులు అక్కడే సహాయక చర్యల్లో ఉంటున్నందున కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశాన్ని మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తర్వాత తెలియజేస్తామని సభ్యులకు సమాచారం అందజేశామన్నారు.

శ్రీనగర్‌లో 89 అడుగుల గణనాథుడు



గాజువాకలోని శ్రీనగర్‌లో 89 అడుగుల భారీ గణనాథుడు కొలువుదీరారు. ఉత్తిష్ట ఆకారంలో ఉత్సవ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఇక్కడి గణేశుడు 23 రోజుల పాటు పూజలు అందుకుంటారు. ఈ విగ్రహం పక్కనే టన్ను చాక్లెట్‌తో రూపొందించిన అయోధ్య శ్రీరాముని విగ్రహం అందరినీ అమితంగా ఆకట్టుకుంటుంది.

ఆర్టీసీకి వరుణుడి దెబ్బ

- 80 బస్సులు రద్దు

4 రోజుల్లో రూ.1.48 కోట్ల ఆదాయానికి గండి

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 8: ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు భారీ వర్షం దెబ్బ తగిలింది. తగినంత మంది ప్రయాణికులు లేకపోవడంతో 80 బస్సులను అధికారులు రద్దు చేశారు. దీంతో నాలుగు రోజుల్లో ఆర్టీసీకి రూ.1.48 కోట్ల ఆదాయానికి గండి పడింది. గురువారం నుంచి కురుస్తున్న వర్షాలకు చాలామంది ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారిలో చాలామంది తమ ప్రయాణాలను వాయిదా వేసుకోగా, అత్యవసర పనులున్న కొద్దిమంది మాత్రమే ప్రయాణాన్ని సాగించారు. దీంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఏడు డిపోలకు చెందిన 80 బస్సులను అధికారులు రద్దు చేశారు. మధురవాడ ... మిగతా 6వ పేజీలో

నేడు విద్యా సంస్థలకు సెలవు

- కలెక్టరేట్, జీవీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలు రద్దు

- వార్తలు 6వ పేజీలో



గోపాలపట్నం రామకృష్ణానగర్‌లో కొండచరియ జారిపడడంతో ప్రమాదం అంచున ఉన్న ఇళ్లు



జలమయమైన దుర్గాలమ్మ గుడి నుంచి పూర్ణామార్కెట్‌కు వెళ్లే రోడ్డు

కుంభవృష్టి

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

- జలమయమైన నగరంలోని లోతట్టు ప్రాంతాలు

- నీట మునిగిన పూర్ణామార్కెట్, పాత నగరం రోడ్లు
- గంగవరంలో కూలిన పెంకుటిల్లు పైకప్పు
- కైలాసపురంలో కూలిన వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రహరీ
- గవర కంచరపాలెంలో ప్రహరీ కూలడంతో దెబ్బతిన్న కార్లు, బైకులు
- సీబీఎం కాంపౌండ్‌లో కూలిన అపార్టుమెంట్ గోడ
- పురాతన భవనాలకు పొంచివున్న ముప్పు
- అప్రమత్తమైన జీవీఎంసీ అధికారులు



గవరకంచరపాలెంలో ప్రహరీ కూలి ధ్వంసమైన బైక్

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నగరం జలమయమైంది. లోతట్టు ప్రాంతాలన్నీ వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. పాత నగరంలోని వీధులతో పాటు రోడ్లపైకి భారీగా వర్షపు నీరు చేరడంతో మోకాలు లోతున నీరు చేరింది. వర్షానికి నానిపోవడంతో ఎక్కడికక్కడ ప్రహరీలతో పాటు పురాతన ఇళ్లు కూలిపోతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో శుక్రవారం నుంచి నగరంలో వర్షం ప్రారంభమైంది. శనివారం సాయంత్రం నుంచి వాన తీవ్రత పెరగడంతో పాటు ఆదివారం రాత్రి వరకూ కొనసాగింది. దీంతో ఎక్కడికక్కడ కాలువలు, గెడ్డలు పొంగి ప్రవహించాయి. ఎర్రిగెడ్డ, గంగులగెడ్డ, చాకలిగెడ్డతో పాటు జగదాంబ జంక్షన్ నుంచి డాబాగార్డెన్స్ అల్లిపురం వంటి ప్రాంతాల నుంచి వర్షపు నీరు ... మిగతా 6వ పేజీలో



పద్మనాభం మండలం విలాస్‌ఖాన్‌పాలెంలో నీట మునిగిన పంట పొలాలు



పద్మనాభం: పొట్నూరులో దుమ్మురి గెడ్డ కాజ్‌వేపై కొట్టుకుపోతున్న యువకుడిని కాపాడుతున్న స్థానికులు

జిల్లా యంత్రాంగం అప్రమత్తం

- తహసీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు భీమిలిలో 87 మి.మీ.ల వర్షపాతం
- ఆదివారం రాత్రి వరకు పెందుర్తిలో 59.75 మి.మీ.లు

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. శుక్రవారం నుంచి ప్రారంభమైన వర్షాలు ఆదివారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు జిల్లాలో వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో 11 తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేకింగా సిబ్బందిని నియమించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి వీటిని పర్యవేక్షిస్తున్నారు. నగరంతో పాటు అన్ని మండలాల్లో మొత్తం 31 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. మత్స్యకారులను చేపల వేటకు వెళ్లకూడదని హెచ్చరించిన అధికారులు, సముద్రంపై నిషా పెట్టారు. కాగా తాడిపూడి రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టానికి చేరుకునే క్రమంలో ఆదివారం ఉదయం 377 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. వర్షాల వల్ల ఇన్‌ఫ్లో పెరిగితే నీటి విడుదల ... మిగతా 6వ పేజీలో

నిండుకుండలా 'మేహాద్రిగెడ్డ'

- 55 అడుగులకు చేరిన రిజర్వాయర్ నీటిమట్టం
- నేడు జలాశయం గేటు ఎత్తే అవకాశం



వరదనీరు చేరడంతో నిండుకుండలా ఉన్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్

గోపాలపట్నం, సెప్టెంబరు 8: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ నీటి మట్టం 55 అడుగులకు చేరింది. రెండు నెలల క్రితం వరకు 46 అడుగులు ఉన్న రిజర్వాయర్ నీటిమట్టం ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు సుమారు తొమ్మిది అడుగుల మేర పెరిగింది. శనివారం రాత్రి నుంచి కుండపోతగా కురుస్తున్న వర్షానికి రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతంలో ఉన్న చెరువులు నిండిపోయి జలాశయానికి పెద్దఎత్తున వరద నీరు చేరుతుంది. శనివారం నుంచి రాత్రి నుంచి సుమారు రెండు అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 61 అడుగులు కాగా ఆదివారం రాత్రికి 55 అడుగులకు చేరింది. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉన్నందున సోమవారం ఉదయానికి నీటి మట్టం మరో అడుగు పెరిగే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 61 అడుగులు కాగా 60 అడుగులకు చేరేంత వరకు గతంలో జలాశయం గేట్లను ఎత్తేవారు కాదు. అయితే రిజర్వాయర్ పూర్తిగా నిండిన తర్వాత గేట్లు ఎత్తితే కొత్తపాలెం గామ శివారులోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. అందువల్ల జలాశయం నీటిమట్టం 56 అడుగులకు చేరిన తర్వాత కొద్ది కొద్దిగా నీటిని విడుదల చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఒక గేటు ఎత్తి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.

ముప్పు ముంగిట కొండవాలు ప్రాంతాలు

తెరిపివ్వని వర్షాలకు జారిపడుతున్న కొండచరియలు


బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్న ప్రజలు

గోపాలపట్నం రామకృష్ణానగర్‌లో కొండచరియ జారిపడడంతో ప్రమాదం అంచున ఐదిళ్లు

- ఏ క్షణమైనా అవి కూలిపోయే ప్రమాదం
- బాధిత కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించిన జీవీఎంసీ అధికారులు
- సీతకొండ వద్ద బీచ్ రోడ్డుపైకి జారిపడిన కొండచరియలు
- రహదారిని మూసివేసిన జీవీఎంసీ, పోలీస్ అధికారులు
- హనుమంతవాక వద్ద జాతీయ రహదారిపై జారిపడిన భారీ రాయి

జీవీఎంసీ పరిధిలో కొండవాలు ప్రాంతాల్లో నివాసాల వివరాలు

మొత్తం కాలనీలు	135
నివాసం ఉంటున్న కుటుంబాలు	14,431
తీవ్రమైన ముప్పు పొంచివున్న ప్రాంతాలు	5
ఐదు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న కుటుంబాలు	249
మధ్యస్థ ముప్పు పొంచివున్న ప్రాంతాలు	89
రక్షణ గోడలు లేని కాలనీలు	73



మురళీనగర్ కొండవాలు ప్రాంతంలో ఇళ్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కొండవాలు ప్రాంతాల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. వాయుగుండం ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంతాల్లో రాళ్లు, మట్టి జారిపడుతోంది. గోపాలపట్నం రామకృష్ణానగర్‌లో కొండవాలు ప్రాంతంలో కొండచరియ జారిపడడంతో ఐదు ఇళ్లు ప్రమాదం అంచున ఉన్నాయి. అధికారులు అందులో ఉంటున్న వారిని ఖాళీ చేయించి పునరావాస కేంద్రానికి తరలించారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా వర్షాలకు కొండవాలు ప్రాంతాలు బాగా నానిపోయి ఉండడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బాధితులతో పాటు అధికారులు భయాందోళనకు గురవుతున్నారు.

నగరంలో ఆరిలోవ, విశాలాక్షినగర్, పెదగదిలి, చినగదిలి, మధురవాడలోని వికలాంగుల కాలనీ, రిక్షా కాలనీ, హెచ్‌బీ కాలనీ దుర్గానగర్, కప్పరాడ, కైలాసపురం, మురళీనగర్‌తోపాటు గోపాలపట్నం, పెందుర్తి, గాజువాక, మల్కాపురం వంటి ప్రాంతాల్లో కొండవాలులోనే చాలామంది నివాసాలు ఏర్పరుచుకున్నారు. దీంతో ఎప్పుడు భారీ వర్షాలు ... మిగతా 6వ పేజీలో

నగరానికి నాగార్జున

గోపాలపట్నం, సెప్టెంబరు 8: విశాఖలో నాలుగు రోజుల పాటు జరగనున్న ఓ సినిమా షూటింగ్‌లో పాల్గొనే నిమిత్తం ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున ఆదివారం నగరానికి విచ్చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు ఆయన ఇక్కడి ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కాగా నాగార్జున సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటిస్తున్న 'కూలీ' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆ షూటింగ్‌లో పాల్గొనే నిమిత్తం ఆయన వచ్చినట్టు తెలిసింది.



విమానాశ్రయంలో నాగార్జున

తెరిపిలేని వర్షాలతో ప్రజలకు అగచాట్లు

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 8 : పూర్ణామార్కెట్ నుంచి కురుపాం మార్కెట్ వరకు ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. రెండు రోజులగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రహదారులపై వర్షం నీరు నిలిచిపోయింది. రోడ్డు విస్తరణ అసంపూర్తిగా మిగిలిపోవడం, కాలువల నిర్మాణం సక్రమంగా చేపట్టకపోవడం తదితర కారణాలు ఇప్పుడు ప్రజలకు ఇబ్బందులు మిగిల్చాయి.. టర్నర్ చౌల్ట్రీ నుంచి కాలువల నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో పాటు లోపల పెద్ద పైపులు అడ్డంగా వేయడంతో చెత్త రోడ్డుపైకి చేరుతోంది. జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణ లోపం వల్ల వన్‌టౌన్ రోడ్డు విస్తరణతో పాటు కాలువ నిర్మాణం లోభూయిష్టంగా తయారయ్యిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పూర్ణామార్కెట్ వద్ద పాత కాలువలపై టైల్స్ వేయడంతో రోడ్డుపై వర్షం నీరు కాలువల్లోకి వెళ్లే అవకాశం లేకపోయిందని వ్యాపారులు చెబుతున్నారు. తమ వ్యాపార కూడలి వద్ద వర్షం కురిసినప్పుడు నీరు చేరుతుందని వాపోయారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారుల వైఫల్యంతోనే వన్‌టౌన్ పూర్తిగా జలమయంగా మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ చొరవ తీసుకుని పాతనగరంలో వర్షం నీటితో ఇబ్బందులు తొలగే చర్యలు తీసుకోవాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు.

సీతమ్మధార, సెప్టెంబరు 8: నగరంలోని కుండపోతగా కురుస్తున్న వర్షం కారణంగా సీతమ్మధారలో పలు రహదారుల్లో నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. వర్షపు నీటిలోనే వాహనదారులు ప్రయాణించవలసిన పరిస్థితి నెలకొంది. సీతమ్మధార ప్రధాన రహదారిలో అల్లూరి సీతారామరాజు విగ్రహం కూడలి రోడ్డు నుంచి పల్లపు ప్రాంతం కావడంతో వర్షపు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో ఇబ్బంది పడుతున్నారు. సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూలు, బాలయేసు చర్చ్ వద్ద రోడ్డుపై పెద్దఎత్తున వర్షపు నీరు నిలిచిపోయింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 8 : భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. ఆదివారం సాయంత్రం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలవారు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. జనసైనికులు, కూటమి శ్రేణులు ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.



సీతమ్మధార ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు



పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిపై ఇలా..

నేడు అన్ని విద్యా సంస్థలకు సెలవు

మహారాణిపేట, సెప్టెంబరు 8: ప్రతికూల వాతావరణం, ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఈ నెల 9న విశాఖలోని ప్రభుత్వ ప్రయివేట్ యాజమాన్య పాఠశాలలకు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఇతర అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ప్రకటించారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసి జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కూడా సెలవు ప్రకటించింది.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

మహారాణిపేట: ఎడతెరిపిలేని వర్షాల కారణంగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

జీవీఎంసీలోనూ రద్దు

విశాఖపట్నం: జీవీఎంసీలో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ పి.సంపత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ఫిర్యాదులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. అయితే వాయుగుండం ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ఈ రద్దు నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజలంతా ఈవిషయాన్ని గమనించాలని వారు కోరారు.

మహిళను మోసగించాడనే అభియోగంతో వ్యక్తిపై కేసు నమోదు

కంచరపాలెం, సెప్టెంబరు 8: మహిళను లోబరుచుకుని మోసం చేశాడనే అభియోగంతో కంచరపాలెం పోలీసులు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భర్తతో విడాకులు తీసుకుని కైలాసపురంలో ఓ మహిళ కన్నవారి ఇంటి వద్ద నివాసం ఉంటోంది. ఈమెకు ఒక కుమార్తె ఉంది. గంగవరం ప్రాంతానికి చెందిన కొవిరి మాధవరావు నాలుగేళ్ల క్రితం ఆమెను పరిచయం చేసుకున్నాడు. ఒంటరిగా ఉండడం చూసి పెళ్లి చేసుకుంటానని లొంగదీసుకున్నాడు. ఆమె కుమార్తెకు ఉద్యోగం ఇప్పిస్తానంటూ బ్యాంకులో ఉన్న డబ్బును కూడా కాజేశాడు. మాధవరావుకు వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలుసుకున్న బాధితురాలు తన పెళ్లి విషయమై ఆరా తీసింది. ఈ తరుణంలో తనతో కలిసి ఉన్న వీడియోలు, ఫొటోలను అందరికీ పంపిస్తానంటూ మాధవరావు బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్. భాస్కరరావు నేతృత్వంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికలకు వ్యాక్సినేషన్ ప్రశంసనీయం

జగదాంబ కూడలి, సెప్టెంబరు 8 : గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం బాలికలకు ఉచితంగా వ్యాక్సినేషన్ సమకూర్చడం గొప్ప విషయమని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఏవీఎన్ కళాశాల వద్ద 37వ వార్డు సచివాలయంలో చైతన్య స్రవంతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. బాలికలు భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా చైతన్య స్రవంతి సేవా సంస్థ ఉచితంగా వ్యాక్సిన్ అందించడం ముదావహమని శ్రీనివాస్ కొనియాడారు. పేద కుటుంబాలకు తోడ్పాటు అందిస్తున్న సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ కృషి అభినందనీయమన్నారు. డాక్టర్ షిరీన్ మాట్లాడుతూ 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు ఈ వ్యాక్సిన్ వేయడం వల్ల యుక్తవయస్సు నాటికి క్యాన్సర్ బారిన పడరన్నారు. కేజీహెచ్ రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి మాట్లాడుతూ ప్రస్తుతం బూస్టర్ డోస్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఏరియా బిజినెస్ మేనేజర్ బి.రామ్‌రతన్, సేవా సంస్థ ప్రతినిధులు రుకియాభాను, విజయకుమారి, అనసూయ, రోజా, లక్ష్మీదేవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



బాలికకు టీకా వేస్తున్న డాక్టర్ షిరీన్ రహమాన్, చిత్రంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ



మురళీనగర్ బృందావన్ పార్కు వద్ద బుద్ధి, సిద్ధి వినాయకస్వామి కల్యాణ ఉత్సవంలో కమిటీ సభ్యులు

వైభవంగా వినాయక ఉత్సవాలు

మురళీనగర్/ అక్కయ్యపాలెం/ సీతమ్మధార: నగరంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆదివారం వర్షం కురుస్తున్నా ప్రజలు మండపాల వద్దకు వెళ్లి దర్శించుకున్నారు. సీతంపేటలోని దుర్గాగణపతిని బంగారు, వెండి ఆభరణాలు, పూలదండలతో అలంకరించారు. అన్ని ప్రాంతాల్లో కొలువుదీరిన మండపాల వద్ద వినాయకుడికి హోమం, అభిషేకాలు, పూజలు చేశారు. పూర్ణామార్కెట్, డాబాగార్డెన్స్, అక్కయ్యపాలెం, మురళీనగర్, జ్ఞానాపురం, కాన్వెంట్ జంక్షన్ ప్రాంతాల్లో అంగరంగ వైభవంగా ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

వక్ఫ్ చట్టం సవరణకు డిమాండ్

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 8 : కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్టాన్ని (2024) సవరించాలని ముస్లిం నాయకులు డిమాండ్ చేశారు. దొండపర్తిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో అఖిలపక్ష చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం కమ్యూనిటీ నాయకుడు షేక్ అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ సవరణ చట్టం ద్వారా తమ పూర్వీకుల ఆస్తులపై హక్కులు లేకుండా చేయడం బాధాకరంగా ఉందన్నారు. 11వ శతాబ్దంలో సుల్తాన్, మొగల్ చక్రవర్తులు, ప్రస్తుతం ధనికుల ఇళ్ల స్థలాలు అల్లాహ్ పేరున వక్ఫ్(దానం) చేశారని గుర్తు చేశారు. వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చిన ఆదాయం పేద ముస్లింలు, వితంతువులు, అనాథలు, పేద విద్యార్థుల చదువులకు, మసీదులు, దర్గాలు, ఖబరస్తాన్లు, సరాయి సత్రాల అభివృద్ధికి ఖర్చు చేయవలసి ఉందని వివరించారు. సెంట్రల్ వక్ఫ్ బోర్డుకు 9,40,000 ఎకరాల ఆస్తి ఉండగా, వీటి ద్వారా వస్తున్న ఆదాయం రూ.8.7 లక్షలు మాత్రమేనన్నారు. కొన్ని వేల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని చెప్పారు. ఈ బిల్లును పార్లమెంటులో విపక్షాలు వ్యతిరేకించడంతో 31 మంది ఎంపీలతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారన్నారు. ఈ సమావేశంలో విపక్ష నాయకులు అజశర్మ, లక్ష్మి, కత్తి పద్మ, అష్రాఫ్, హైదరాలి సింకా తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన విపక్ష నాయకులు

పోలీస్ కమిషనర్ మానవత

ఎం.వి.పి.కాలనీ, సెప్టెంబరు 8 : వినాయకచవితి సందర్భంగా నగరంలో పర్యటిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఓ సంఘటనలో తన మానవత్వం చాటుకున్నారు. శనివారం రాత్రి చవితి పందిర్లు, నిమజ్జన ప్రాంతాల పరిశీలనకు వెళ్తుండగా ఎం.వి.పి. కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాసన్స్‌బే కాలనీ వద్ద ఒంటిపై దుస్తులు సమకూర్చి ఏదో ఒక స్వచ్ఛంద సంస్థ ఆశ్రమంలో చేర్పించమని ఆదేశించారు. అనంతరం ఫొటోలతో సహా తన వాట్సాప్‌కు పంపించమని సూచించారు. ఎం.వి.పి. పోలీసులు తగిన చర్యలు తీసుకుని, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అప్పగించారు.



మతిస్థిమితం లేని వ్యక్తిని ఆశ్రమంలో చేర్పిస్తున్న పోలీసుల

పలు రైళ్ల గమ్యం కుదింపు...రీ షెడ్యూల్

విశాఖపట్నం, సెప్టెంబరు 8: వాల్తేరు డివిజన్ పరిధిలోని పూండి-నౌపడ, తిలారు-కోటబొమ్మాళి సెక్షన్ల మధ్య భద్రత నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-పలాస మధ్య నడిచే 07470, 07471 నంబర్లు గల మెము రైళ్లు ఈ నెల 12 నుంచి 14 వరకు విశాఖ-శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య రాకపోకలు సాగిస్తాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు-పలాస మధ్య రాకపోకలు తాత్కాలికంగా రద్దు చేశామన్నారు. ఈ నెల 11న సాయంత్రం 6.50 గంటలకు పాండిచ్చేరిలో బయలుదేరాల్సిన పాండిచ్చేరి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (1289) రాత్రి 9.35 గంటలకు (రెండు గంటల 45 నిమిషాలు ఆలస్యంగా), అలాగే ఈ నెల 11, 13 తేదీల్లో మధ్యాహ్నం 1.40 గంటలకు కేఎస్ఆర్ బెంగుళూరులో బయలుదేరాల్సిన కేఎస్ఆర్ బెంగుళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464) సాయంత్రం 4.10 గంటలకు (రెండు గంటల 30 నిమిషాలు ఆలస్యంగా) బయలుదేరుతాయన్నారు.

మళ్లింపు మార్గంలో కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్

భారీ వర్షాల నేపథ్యంలో విశాఖ, కిరండోల్ మధ్య నడిచే నైట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా విశాఖ-కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18514) ఈ నెల 11 వరకు విజయనగరం, రాయగడ, కొరాపుట్ మీదుగానూ, తిరుగు ప్రయాణంలోని కిరండోల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18513) ఈ నెల 11వ తేదీ వరకు కొరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

నూతన భవనంలో చేపల విక్రయం

మహారాణిపేట, సెప్టెంబరు 8: ఫిషింగ్ హార్బర్‌లో నిర్మించిన నూతన భవనంలో చేపల విక్రయం ప్రారంభించారు, ఇంతకాలం ఆరుబయటనే చేపలు విక్రయించేవారు. సుమారు రూ.2.5 కోట్ల టాటా గ్రూప్ సీఎస్ఆర్ నిధులతో దీన్ని నిర్మించారు. సుమారు 150 మంది వ్యాపారులు చేపలు విక్రయించుకునే సౌలభ్యం ఉంది. ప్రతి బ్లాక్‌కు ప్రత్యేకంగా నీటి కుళాయి. లైట్లతో పాటు పలు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆదివారం నూతన భవనం ప్రారంభించడంతో చేపల వ్యాపారులకు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకపోయింది..



ఫిషింగ్ హార్బర్‌లో నిర్మించిన నూతన భవనంలో చేపల విక్రయం

ఆర్టీసీకి వరుణుడి దెబ్బ

... 5వ పేజీ తరువాయి

డిపో నుంచి ఎనిమిది, వాల్తేరు డిపో నుంచి 15, మద్దిలపాలెం డిపో నుంచి 13, విశాఖ నుంచి పది, గాజువాక నుంచి 15, సింహాచలం డిపో నుంచి 12, స్టీల్ సిటీ డిపో నుంచి ఏడు బస్సులను రద్దు చేశారు. జిల్లాలో డిమాండ్ లేని రూట్లలో బస్సులను రద్దు చేసినట్టు అధికారులు ప్రకటించారు. కాగా ఆర్టీసీ విశాఖ రీజియన్ గత నెల సగటు ఆక్యుపెన్సీ రేషియో 72 శాతంగా, రోజువారి సగటు ఆదాయం కోటి రూపాయలుగా నమోదైంది. కాగా ఈ నెల ఐదున 58 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదై రూ.64 లక్షల ఆదాయం వచ్చింది. ఆరో తేదీన 65 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదై రూ.68 లక్షల ఆదాయం, శనివారం 50 శాతం ఆక్యుపెన్సీ నమోదై రూ.60 లక్షలు, ఆదివారం 50 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదై రూ.60లక్షలు ఆదాయం వచ్చింది. ఈ నాలుగు రోజుల్లో రూ. నాలుగు కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా, రూ.2.52 కోట్లు మాత్రమే వచ్చింది. రూ.1.48 కోట్ల ఆదాయానికి గండి పడింది.

జిల్లా యంత్రాంగం అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఈ మేరకు పద్మనాభం, భీమిలి తహసీల్దార్లను అప్రమత్తం చేశారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం 55 అడుగులకు చేరగా, ఇన్‌ఫ్లో 477 క్యూసెక్కులగా ఉంది. సోమవారం ఉదయం ఒక గేటు ఎత్తి వేయనున్నట్టు అధికారులు తెలిపారు. వర్షాల నేపథ్యంలో అన్ని విభాగాలను అప్రమత్తంచేశామని డీఆర్‌వో కె.మోహన్‌కుమార్ తెలిపారు.

శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు తహసీల్దార్ కార్యాలయాల్లోని రెయిన్ గేజ్‌ల వద్ద రికార్డు అయిన వివరాలను పరిశీలిస్తే.. అత్యధికంగా భీమిలిలో 87 మి.మీ. వర్షపాతం నమోదైంది. మహారాణిపేటలో 74.4, సీతమ్మధారలో 72.6, ఆనందపురంలో 68.6, విశాఖపట్నం రూరల్‌లో 66.4, పెదగంట్యాడలో 55.8, పద్మనాభంలో 53.6, గోపాలపట్నంలో 52.4, ములగాడలో 48.6, గాజువాకలో 45.8, పెందుర్తిలో 42.8 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏపీఎస్‌డీపీఎస్ ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌లో పెందుర్తిలో 59.75, గోపాలపట్నంలో 59.25, మదీనాబాగ్‌లో 59.0, గంభీరంలో 57.5, ఎయిర్‌పోర్టులో 57.2 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అంటే శనివారం నుంచి ఆదివారం వరకు పలుచోట్ల సగటున పది సెంటీ మీటర్ల కంటే ఎక్కువగా వర్షపాతం నమోదైంది.

'ఆలయం' చలన చిత్రం షూటింగ్ ప్రారంభం


జగదాంబ కూడలి, సెప్టెంబరు 8 : వన్‌టౌన్ కనకమహాలక్ష్మి దేవస్థానం ప్రాంగణంలో ఆలయం చలనచిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం సందడిగా జరిగింది. ఆదివారం ఉదయం అమ్మవారి సన్నిధిలో జరిగిన ముహూర్తపు సన్నివేశంలో చిత్ర కథానాయికపై ఎమ్మెల్యే వంశీకృష్ణ క్లాప్ కొట్టారు. చిత్ర దర్శకురాలు రోహిణి విలేకరులతో మాట్లాడుతూ విశాఖ, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతామన్నారు. కొత్త నటీనటులతో చిత్రం తెరకెక్కుతుందని వివరించారు. అమ్మవారికి చిత్రయూనిట్‌తో పాటు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. అర్చకులు అమ్మవారి సన్నిధిలో అభిషేకాలు, కుంకుమ పూజలు ఆయనతో జరిపించారు. జేఈవో వి.రాంబాబు అమ్మవారి ప్రసాదాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

మల్కాపురం, సెప్టెంబరు 8: శ్రీహరిపురం జీవీఎంసీ మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుకనున్న హాకర్‌జోన్‌లో జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అప్పలనాయుడు మృతి చెందారు. అతను 59వ వార్డులో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులతో విభేదాలతో గత కొంతకాలంగా హాకర్‌జోన్‌లోనే గడుపుతున్నారు. అయితే, వారం రోజులుగా ఆరోగ్యం బాగాలేదు. ఈ స్థితిలో ఆయన మృతి చెందినట్టు భా విస్తున్నారు. అప్పలనాయుడు మృతి చెందిన విషయాన్ని స్థానికులు కొంతమంది గుర్తించి మల్కాపురం పోలీసులకు తెలిపారు. సీఐ విద్యాసాగర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతుని వివరాలను సేకరించారు. ఈ లోగా మృతుడి బంధువులు వచ్చారు. పోలీసులు ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు.

ద్వారకా సీఐ బాధ్యతల స్వీకరణ

సీతంపేట, సెప్టెంబరు 8: ద్వారకా పోలీసు స్టేషన్ సీఐగా డి.వెంకటరమణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పూర్వ సీఐ రమేష్ మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ వెంకటరమణ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు హద్దు మీరితే చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతలు కాపాడతామన్నారు.



వెంకటరమణ

కుంభవృష్టి

... 5వ పేజీ తరువాయి

పాత నగరం వైపు పోటెత్తింది. దీంతో పాత నగరంలోని రహదారుల్లో మోకాలు లోతు నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్లపై నిలిచిన నీరు డ్రైనేజీల్లోకి చేరేలా ఏర్పాటు చేసిన రంధ్రాలు ప్లాస్టిక్ వ్యర్థాలతో మూసుకుపోవడంతో స్థానికులే వాటిని తొలగించి నీరు కాలువల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. వారం రోజులు కిందట కురిసిన వర్షాలకు తడిచిముద్దయిన భవనాలు, కొండవాలు ప్రాంతాలు తాజాగా కురుస్తున్న వర్షాలకు మరింత నానిపోయాయి. దీంతో పురాతన భవనాలు, ప్రహరీలు కూలిపోతుండగా, కొండవాలు ప్రాంతాల్లో రాళ్లు జారిపడుతున్నాయి. గోపాలపట్నంలోని రామకృష్ణానగర్‌లో భారీ కొండచరియ పడడంతో ఇళ్లకు ముప్పు ఏర్పడింది. గంగవరంలోని బడివీధిలో ఉన్న పురాతన పెంకుటిల్లు పైకప్పు కూలిపోయింది. అందులో ఎవరూ నివాసం లేనందున ప్రాణ నష్టం తప్పింది. గవర కంచరపాలెంలో రైల్వే ప్రహరీ కూలి పక్కనే ఉన్న రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలపై అవి పాక్షికంగా దెబ్బతిన్నాయి. సీబీఎం కాంపౌండ్‌లో ఒక అపార్ట్‌మెంట్ ప్రహరీ కూలిపోయింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. హెచ్‌బీకాలనీలోని నర్సింహనగరంలో కొండవాలు రక్షణ గోడ కూలిపోయింది. ఆనందపురం ఉన్నత పాఠశాల ప్రహరీ కూలి పక్కనే ఉన్న ఇంటిపై పడిపోయింది. అయితే అధికారులు ముందు జాగ్రత్తగా ఆ ఇంట్లో వారిని పునరావాసకేంద్రానికి తరలించారు. సీపీ శంఖబ్రత బాగ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కైలాసపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రహరీ వర్షానికి కూలి రోడ్డుపై పడింది. అయితే ఎవరికీ ఏమీ కాలేదు. పద్మనాభం మండలం పొట్నూరులో నూకాంబిక చెరువు నిండిపోవడంతో మిగులు జలాలు పారే దుమ్మురి గెడ్డ వేగంగా ప్రవహించడంతో గ్రామంలోకి వెళ్లే కాజువే మీదుగా పెద్దఎత్తున నీరు ప్రవహిస్తుంది. దీంతో విజయగనరం జిల్లా జామి మండలం బలరాంపురానికి చెందిన వ్యక్తి ప్రవాహంలో కొట్టుకుపోవడంతో స్థానికులు తాడు సహాయంతో రక్షించారు. అలాగే మండలంలో చెరువు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కొన్ని పంట పొలాలు నీట మునిగాయి.

వర్ష తీవ్రతపై సీఎం చంద్రబాబు ఆరా

కుండపోత వర్షాలపై సీఎం చంద్రబాబునాయుడు ఆదివారం ఆరా తీశారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌తో టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వర్షాల తీవ్రత, ముందస్తుచర్యలను కమిషనర్ సీఎంకు వివరించారు. ముప్పు ఉన్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామని, ఆయా ప్రాంతాల్లోని నివాసితులను అప్రమత్తం చేశామని వివరించారు. 80 చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, అందులో 10,620 మందిని ఉంచేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. గోపాలపట్నంలో కొండచరియ పడిన ఘటనకు సంబంధించి ఐదు కుటుంబాలతోపాటు వారి నివాసాలకు సమీపంలో ఉన్న మరో 20 కుటుంబాలను కూడా పునరావాస కేంద్రానికి తరలించినట్టు చంద్రబాబుకు వివరించారు. ముప్పు ఉన్న ప్రాంతాల వారిని ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ప్రాణ నష్టం లేకుండా చూడాలని కమిషనర్‌కు సీఎం ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించిన మేయర్

భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆదివారం పర్యవేక్షించారు. జోన్-3, జోన్-5లోని ప్రధాన గెడ్డలు పొంగి ప్రవహిస్తుండడంతో అధికారులతో కలిసి ఆయా గెడ్డలు సముద్రంలో కలిసే చోటకు వెళ్లి పరిశీలించారు. ఎర్రిగెడ్డలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు భారీగా వస్తుండడంతో వాటిని నిరంతరం జేసీబీలతో తొలగించి నీటి ప్రవాహం సజావుగా సాగేలా పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పెదజాలారిపేట బీచ్‌లో వినాయక నిమజ్జనాలు జరిగే చోటును పరిశీలించి, ఇక్కడి వ్యర్థాలను తొలగించాలని సూచించారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్లారు. అక్కడ చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్‌తో కలిసి నగరంలోని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు సంబంధించి ప్రజల నుంచి జీవీఎంసీ కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మేయర్ వెంట ఏడీసీ రమణమూర్తి, ఎస్ఈ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

ముప్పు ముంగిట కొండవాలు ప్రాంతాలు

... 5వ పేజీ తరువాయి

పడినా ఎక్కడో ఒకచోట కొండచరియలు విరిగిపడడం, మట్టిపెళ్లలు జారి ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారిం ది. ఎనిమిదేళ్ల కిందట భారీ వర్షం కారణంగా కైలాసపురంలో రాత్రివేళ కొండచరియ విరిగిదిగువ నున్నఇంటిపై పడడంతో ముగ్గురు మృతి చెందారు. చాలాచోట్ల కొండవాలు ప్రాంతాల్లోని నివాసాలకు రక్షణగా గోడలు లేకపోవడం ప్రమాదానికి కారణంగా మారుతున్నాయి. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నందున భారీ వర్షాల సమయంలో అధికారులు ముందు జాగ్రత్తగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తుండడంతో ప్రాణనష్టం వాటిల్లడం లేదు. అంతేగానీ రక్షణ గోడల నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. అంతకుముందు కూడా అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల పాటు విస్తారమైన వర్షాలు పడ్డాయి. దీనివల్ల కొండవాలు ప్రాంతాలన్నీ బాగా నానిపోవడంతో క్రమేపీ కుంగుతున్నాయి. ఈ క్రమంలో రాళ్లు విరిగిపడడం, మట్టిరియలు జారిపోవడం జరుగుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని భవనాలు, ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఏర్పడుతోంది. రెండు రోజుల కిందట భారీ వర్షానికి హనుమంతవాక వద్ద కొండవాలులోని ఓ బండరాయి జారి జాతీయ రహదారిపై పడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తాజాగా గోపాలపట్నం రామకృష్ణానగర్ వద్ద కొండచరియ విరిగిపడడంతో ఐదు భవనాల కింద మట్టి కోతకు గురైంది. ఇందులో ఒక భవనం గాల్లోనే వేలాడుతోంది. ఏ క్షణమైనా ఐదు భవనాలు కూలిపోయే ప్రమాదం ఉందని జీవీఎంసీ, పోలీస్ అధికారులు గుర్తించి అందులో ఉంటున్న వారిని ఖాళీ చేయించి లక్ష్మీనగర్‌లోని పునరావాస కేంద్రానికి తరలించారు. అదేవిధంగా బీచ్ రోడ్డులో సీతకొండ నుంచి రాళ్లు జారి కిందకు పడుతున్నాయి. ఆదివారం ఉదయం కొన్ని రాళ్లు బీచ్ రోడ్డుపైకి దూసుకురావడంతో జీవీఎంసీ, పోలీస్ అధికారులు అప్రమత్తమై ముందు జాగ్రత్తగా కొండ వైపు ఉన్న రోడ్డును మూసివేశారు.

కొండవాలులో 14,431 కుటుంబాలు

నగరంలోని కొండవాలు ప్రాంతాల్లో నివాసాలు, ప్రమాదం ముంగిట ఉన్న ప్రాంతాలపై జీవీఎంసీ, రెవెన్యూశాఖ అధికారులు సంయుక్తంగా ఈ నెల రెండున సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ పరిధిలో కొండవాలు ప్రాంతాల్లో 135 కాలనీలు ఉన్నట్టు గుర్తించారు. ఇందులో 14,431 కుటుంబాలు నివాసం ఉంటున్నట్టు తేలింది. కొండవాలులో ఉన్న కాలనీల్లో అనకాపల్లి జోన్‌లోని ఇందరమ్మ కాలనీ, బీసీ కాలనీ-1, బీసీ కాలనీ-2, పాస్టర్ కాలనీతో పాటు జోన్-2 పరిధిలోని హనుమంతవాక కాలనీలు తీవ్రమైన ప్రమాదం ముంగిట ఉన్నట్టు గుర్తించారు. ఈ ఐదు కాలనీల్లో 249 కుటుంబాలు నివసిస్తున్నాయని,వీరందరినీ ప్రత్యామ్నాయ స్థలాలకు తరలించడం ద్వారా భవిష్యత్తులో ప్రాణ నష్టాన్ని నివారించవచ్చునని అధికారులు అభిప్రాయ పడ్డారు. కొండవాలులో ఉన్న కాలనీల్లో మధ్యస్థ ప్రమాదం ముంగిట 89 కాలనీలు ఉన్నట్టు గుర్తించారు. అంతేకాకుండా కొండవాలులోని 73 కాలనీలకు రక్షణ గోడలు లేవని సర్వే ద్వారా అధికారులు తేల్చారు.

ప్రజలను అప్రమత్తం చేశాం

భారీ వర్షాల నేపథ్యంలో కొండవాలు ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలను అప్రమత్తం చేశాం. ముప్పు ఉందని గుర్తించిన ఇళ్లల్లోని వారిని ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు/పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు చేపట్టాం. జోన్‌ల వారీగా ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నాం. జోనల్ కమిషనర్లు, యూసీడీ, ఇంజనీరింగ్ అధికారులంతా సమష్టిగా పనిచేస్తూ ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రణాళికను అమలు చేస్తున్నారు. పోలీస్, రెవెన్యూశాఖలతో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు ప్రజలకు సమచారం అందజేస్తున్నాం. కొండవాలు ప్రాంతాల్లో శాశ్వత రక్షణ కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ రూపొందించేందుకు రెవెన్యూ శాఖతో కలిసి ఇటీవలే కొండవాలు ప్రాంతాల్లో అధ్యయనం చేశాం.

-పి.సంపత్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్

కుండపోత

» లోతట్టు ప్రాంతాలు జలమయం » రహదారులు ఛిద్రం

గోపాలపట్నం, సెప్టెంబరు 8: అల్పపీడనంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. శనివారం రాత్రి నుంచి కుండపోతగా కురిసిన వర్షానికి 89వ వార్డు శివారులోకి కొత్తపాలెంలోని పరదేశమ్మనగర్, భగత్‌సింగ్‌నగర్, వైఎస్సార్ నగర్ కాలనీలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. కొత్తపాలెం-నరవ ప్రధాన రహదారిలో వర్షం నీరు చేరకుండా పలు చోట్ల ఎక్సకవేటర్‌లతో తవ్వకాలు చేపట్టడంతోముంపు సమస్య తప్పింది. గోపాలపట్నంలోని రామకృష్ణానగర్‌లో ఆదివారం ఉదయం కొండచరియ జారి పడిన ప్రాంతాన్ని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పరిశీలించారు. జీవీఎంసీ, పోలీస్ అధికారులను అప్రమత్తం చేశారు.ఇక్కడి ఇళ్ల నుంచి లక్ష్మీనగర్ పాఠశాలకు తరలించిన నివాసితులకు తగిన వసతి కల్పించాలని అధికారులు ఆదేశించారు.

భీతిల్లుతున్న ఆవాస ప్రజలు

ఆటోనగర్: జీవీఎంసీ 70 వార్డు డ్రైవర్సు కాలనీ,71 వార్డు శ్రీనగర్ కొండలపై ఏర్పాటు చేసుకున్న ఆవాసాల్లోని ప్రజలు భీతిల్లుతున్నారు. అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా వర్షాలతో కొండలపై ఉన్న మట్టి కరిగిపోతుండటంతో వీటిపై ఆవాసాలు ఏర్పాటుచేసుకున్న జనాలు ఏ క్షణంలో కొండ చరియలు మీదపడతాయోమోనన్న ఆందోళనలో గడుపుతున్నారు.

అగనంపూడి: అగనంపూడి, పరిసర ప్రాంత ప్రధాన గెడ్డలు పొంగి ప్రవహించాయి. కొండ వాగు నుంచే వచ్చే బొర్రమ్మ గెడ్డ నీటి ఉధృతితో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. తలారివానిపాలెం, ఫార్మాసిటీ కాలనీల్లోని వీధి రోడ్లు ధ్వంసమయ్యాయి. దువ్వాడ ప్రధాన రహదారి, ఇ-మర్రిపాలెం బస్టాప్ సమీపంలో జాతీయ రహదారిపైనుంచి వరద నీరు నిలిచి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అగనంపూడి కూడలిలో కోతకు గురై డ్రైనేజీలు ధ్వంసమయ్యాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జడ్సీ

గాజువాక: కొండవాలు, లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని గాజువాక జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు పేర్కొన్నారు. భారీ వర్షాలతో కొండ చరియలు విరిగిపడే ప్రమాదముందని హెచ్చరించారు.

వర్షానికి కూలిన గోడ

ఆర్పీపేట,(కంచరపాలెం): వర్షాలకు జీవీఎంసీ 56వార్డు గవరకంచరపాలెం గౌరీ సంఘం సమీపంలో రైల్వే గోడ కూలిపోయింది. కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ సమాచారం మేరకు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికులను అప్రమత్తం చేశారు. ఈ గోడ కూలిన ఘటనలో రెండు కార్లు, మూడు బైక్‌లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి.

పొంగి ప్రవహిస్తున్న ప్రధాన కాలువలు

గాజువాక: గాజువాక పట్టణం నుంచి గంగవరం బీచ్ వరకు గల ప్రధానగెడ్డ నుంచి వర్షం నీరు పొంగి ప్రవహిస్తోంది. గంగవరం పోర్టు ప్రాంతంలో వరద నీరు నిలిచిపోవటంతో అక్కడి హౌసింగ్ బోర్డుకాలనీని జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు సిబ్బందితో పరిశీలించారు. జేసీబీల సహాయంతో గెడ్డలో పూడికను తీసివేయించి నీటిని మళ్లించారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి. పులి వెంకటరమణారెడ్డి ఈ పనులు పర్యవేక్షించారు.

కూలిన ఇంటి పైకప్పు

పెదగంట్యాడ: గంగవరం నిర్వాసిత కాలనీ బడెవారివీధిలో ఉమ్మిడి ధనం ఇంటికప్పు శనివారం అర్ధరాత్రి కూలిపోయింది. ఇంట్లో ఎవరూలేకపోవడంతో ప్రమాదం తప్పింది. 69 వార్డు పరిధిలోని లోతట్టు ప్రాంతాలలో శనివారం వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పర్యటించారు. నాతయ్యపాలెంలో డెంగ్యూ జ్వర బాధితులను పరామర్శించారు.

అక్కిరెడ్డిపాలెం: నాతయ్యపాలెం నుంచి కృష్ణమహంతి చెరువు మీదుగా షీలానగర్‌కు వెళ్లేరహదారిలో వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో వాహన చోదకులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి నుంచి షీలానగర్‌కు వెళ్లే రహదారిలో హరిజన జగ్గయ్యపాలెం వద్ద, ఆటోనగర్ నుంచి తుంగ్లాం కాలనీలోకి వెళ్లే రహదారిలో కూడా కొద్ది సేపు వర్షపు నీరు నిలిచి వాహన చోదకులతో పాటు స్థానికులకు సమస్యలు తలెత్తాయి.

మల్కాపురం: శ్రీహరిపురం పాతరామాలయం వీధిలో ఆదివారం మధ్యాహ్నంపాడుబడిన ఇంటి గోడకూలిపోయింది. ఈస్థలాన్ని మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీడీపీ నేత పోత్తబత్తుల శ్రీను పరిశీలించారు.

పత్తాలేని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

ఎడతెరిపిలేకుండా వర్షాలు పడుతున్నా ములగాడ మండల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పత్తాలేకుండా లేకుండా పోయారు. కలెక్టర్. రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు ఇచ్చినా స్థానిక కార్యాలయ సిబ్బంది పట్టించుకోలేదు.

శ్రీనగర్: జీవీఎంసీ 71 వార్డు శ్రీరామ్ నగర్‌లో ఇల్లపు కుమారి ఇంటికి ఆనుకుని ఉన్న కాంపౌండ్‌వాల్ కూలిపోయింది. దీంతో పక్కనున్న మాసవరపు సన్యాసిరావు, రాజుకు చెందిన ఇళ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి.

కూర్మన్నపాలెం: 70 వార్డు ఎల్‌వి నగర్ రహదారిలో గోతుల్లో ఆటో దిగబడింది. 71 వార్డు ఆటోనగర్, తోకాడ, ఎంఎస్ఎంఈ కార్యాలయం వెళ్లే రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.86, 87 వార్డుల్లో వడ్లపూడి, సిద్దార్థ నగర్ వాటర్ ప్లాంట్, ఫకీర్‌తఖ్యా, రాజీవ్ నగర్, రాసాలమ్మ కాలనీ, ఎన్టీఆర్ నగర్, కణితి, వడ్లపూడి, ఉప్పరకాలనీ, యాతపాలెం,కాపు జగ్గరాజుపేట, రేడియో స్టేషన్ రోడ్, సాయిరాం నగర్ రహదారులపై వరద నీరు ప్రవహిస్తోంది. ప్రధాన డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లాయి. కాలువల్లో వ్యర్థాలు రోడ్లపైకి చేరుకున్నాయి.కాలనీలు చెరువును తలపిస్తున్నాయి. దువ్వాడ నుంచి మంగళపాలెం కూర్మన్నపాలెం,కాపు జగ్గరాజు పేటల మీదుగా జాతీయ రహదారికి వెళ్లే ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలిచి స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.


రాజధాని కాటా నుంచి తుంగ్లాం మార్గంలో వర్షం నీరు


కొండచరియ జారిపడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు


భగత్‌సింగ్ నగర్‌లో ముంచెత్తిన వర్షంనీరు

విరిగిపడిన కొండచరియ

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్ గ్రంథాలయం వద్ద కొండ చరియ విరిగి పడింది. విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నీటి ముంపులో జగనన్న కాలనీ

పెందుర్తి, సెప్టెంబరు 8: ఎడతెరిపి లేకుండా వర్షాలకు మండలంలోని 52 చెరువుల్లో పూర్తిస్థాయిలో నీరు చేరింది. దీంతో గట్లు తెగిపోయే ప్రమాదం ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం పెందుర్తిలోని పెదచెరువును తహసీల్దార్ వేణుగోపాల్ సందర్శన చేసి పరిశీలించారు. చెరువు గట్టు తెగిపడకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. గుర్రమ్మపాలెంలోని జగనన్న కాలనీలో కొంత మేరకు నీటిముంపునకు గురైంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురుకావడంతో తహసీల్దార్ రహదారిలో ట్రెంచ్‌లు కొట్టించి వరద నీరు ప్రవాహానికి అడ్డంకి లేకుండా చేశారు. వాలిమెరక జగనన్నకాలనీకిఅప్రోచ్ రోడ్ లేక ఈరోడ్డు వరద నీటిలో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. చినముషిడివాడ క్రాంతినగర్,సుజాతనగర్ శివారు ప్రాంతాల రోడ్లు పెందుర్తి నూకాంబిక ఆలయం వెనక కాలనీ. బాలాజీనగర్, దొగ్గవానిపాలెం రహదారులు చిత్తడిగా మారాయి. సుజాతనగర్ రిలయన్స్ ఫ్రెష్ వద్ద విద్యుత్ స్తంభం తీగ బయటకురావటంతో ఎమ్మెల్యే చొరవతో సమస్యను సిబ్బంది పరిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంతో కంట్రోల్ రూం ఏర్పాటుచేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్: 7702577311ను సంప్రదించాలి.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 8: బుచ్చిరాజుపాలెంలోని గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ రమేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారు ఫోన్: 784271 7183కి సంప్రదించాల్సిందిగా కోరారు. గోపాలపట్నం కొండవాలు పరిధిలోని అనేక ఇళ్లను ఖాళీ చేయించి లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలకు తరలించి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

అక్షర జ్ఞానంతో విజ్ఞానం

పెందుర్తి, సెప్టెంబరు 8: అక్షరజ్ఞానంతో విజ్ఞానం పొందవచ్చని జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక బీసీ వసతిగృహంలో ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. అనంతరం వ్యాస రచనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీడీ వర్మ, ఏడీ చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌వి నగర్‌లో పంచముఖ గణనాథుడు


వడ్లపూడిలో మర్రిచెట్టుకు కట్టిన ఊయలలో పర్యావరణ గణపతి


వేపగుంట బీసీకాలనీలో సిక్స్ ప్యాక్ వినాయకుడు


బెల్లం వినాయకుడి సన్నిధిలో ఎమ్మెల్యే గణబాబు


వెంకటేశ్వరకాలనీలో శివుని ఆకారంలో గణపతి


అప్పలనరసయ్యనగర్‌లో గోకుల కృష్ణుడి రూపం...

వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 8: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్, తోకాడ, చట్టివానిపాలెం ప్రాంతాలలో వినాయక చవితి ఉత్సవాలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. శనివారం ఈవేడుకలుప్రారంభమయ్యాయి. 70 వార్డు ఎల్‌వీ నగర్ కాలనీలోకాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పంచముఖ గణపతినెలకొల్పారు. శ్రీనగర్ దరి సుందరయ్య కాలనీలో కొబ్బరి చిప్పలో వినాయకుడిని ఏర్పాటుచేశారు. వడ్లపూడిలో దుర్గా భవానీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో మర్రిచెట్టుకు ఉయ్యాల కట్టి దానిలోపర్యావరణ గణపతి నెలకొల్పారు. మాతృశ్రీనగర్‌లో అసోసియేషన్ గణనాథుని మం డపం వద్ద టీడీపీ నేత నల్లారు సూర్యనారాయణ పూజలు చేశారు.

అగనంపూడి: అగనంపూడి, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు ఉక్కు నిర్వాసిత గ్రామాల్లో వినాయ నవరా త్రి ఉత్సవాలుప్రారంభించారు.పెదమడకసంపత్‌వినాయక ఆల యలో జరిగిన పూజ ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. కొండయ్యవలస ఆదర్శ హనుమన్ యువజనసేవా సంఘం ఆధ్వర్యంలో గణపతిని అయ్యప్ప రూపంలో ఏర్పాటు చేశారు.

గోపాలపట్నం: గోపాలపట్నం, వెంకటాపురం, కొత్తపాలెం, వైఎస్సార్ నగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపైన శ్రీవెంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానం, షీలానగర్ ఎస్టీబిఎల్‌లో తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంతో పాటు అనేక కాలనీలో వినాయక చవితి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

పెదగంట్యాడ: పెదగంట్యాడ ప్రాంతంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నెల్లిముక్కులో జరిగిన ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పెందుర్తి: సుజాతనగర్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు గణేశ పూజలు నిర్వహించారు. పాత పెందుర్తిలో జరిగిన వినాయక ఉత్సవాల్లో జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు పాత పెందుర్తి, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, రాజుచెరువు, వెలంపేట, దొగ్గవానిపాలెం, వెలంపేట,రాడివారికళ్లాల్లో కొలువు దీరిన గణేశ్ మండపాలను సందర్శించారు.

గాజువాక: గాజువాక దరి శ్రీనగర్ ప్రాంతంలో 89 అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే, ఇదే ప్రాంగణంలో టన్ను చాక్లెట్‌తో విగ్రహం ఏర్పాటు చేశారు. మోహన్‌నగర్‌లోని వినాయక విగ్రహం ఏర్పాటుచేశారు.

ఎన్.ఎ.డి.జంక్షన్, వేపగుంట: బాజీజంక్షన్ కరణాలవీధి, బుచ్చిరాజుపాలెం, వేపగుంట బీసీకాలనీల్లో వినాయక విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.

కొలువు దీరిన బెల్లం వినాయకుడు

మల్కాపురం, సెప్టెంబరు 8: గాజువాక ఆర్టీసీ డిపో పక్కనే ఖాళీగా ఉన్న ఏపీఐఐసీ స్థలంలో లంబోధర ట్రస్ట్ ఆధ్వర్యంలో 75 అడుగుల బెల్లం వినాయకుడు కొలువుదీరాడు. ఈ విగ్రహానికి తొలిపూజ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు శనివారం ఉదయం 11 గంటలకు చేశారు. ఆ తరువాత ఉత్సవ నిర్వాహకమిటీ ప్రతినిధులు సతీసమేతంగా పూజలు చేశారు. భక్తుల దర్శనం నకు అవకాశం కల్పించారు. శనివారం దాదాపుగా ఐదువేలకు పైగా భక్తులు బొజ్జగణపయ్యను దర్శనం చేసుకున్నారు.


పాతపెందుర్తిలో పూజల్లో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా


సుందరయ్య కాలనీలో పూజల్లో బీజేపీ నేత నరసింగరావు


నెల్లిముక్కు ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు


రామ్‌నగర్‌లో వ్యాయామ పరికరాలతో రూపొందించిన గణపతి

భారీ వర్షంతో అవస్థలు..

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 8: వర్షాలకు ఎన్.ఎ.డి గణేష్‌నగర్, ఉడాకాలనీ సంజీవయ్య కాలనీ ఎన్.ఎస్.టి.ఎల్ గేటు పరిసరాలు, ఎన్.ఎ.డి.పై ఓవర్‌కు వెళ్లే సర్వీసు రోడ్డులోని ఎన్.ఎస్.టి.ఎల్ మలుపు వద్ద వర్షపు నీరు చేరటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వినోద్ నగర్, సాకేతపురం, కాకానీనగర్, విమాన్‌నగర్ శివారు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. కాకానీనగర్ శివాలయం రహదారిపై నీరు నిలిచిపోయి పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తయి. బుచ్చిరాజుపాలెం బీఆర్‌టీఎస్ బస్‌స్టాప్ వద్ద, సర్వీస్ రోడ్డులో మోకాలి లోతువరకు వర్షపునీరు నిలిచిపోయింది. బాజీజంక్షన్ నుంచి పాతగోపాలపట్నం వెళ్లే రహదారిలో నీరు నిలిచిపోయింది. శ్రీనివాసనగర్ నగర్ శివారు సమతాకాలనీలో కార్పొరేటర్ రాపర్తి కన్నాపరిశీలించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రహ్లాదపురం పల్లినారాయణపురంలో వర్షాలకు దెబ్బతిన్న గంగా శంకర్, దా సరి అప్పలరాజు, గండు సత్తెమ్మ ఇళ్లను పరిశీలించారు.

నేడు స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనం వద్ద ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 8: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్లాంట్ అడ్మిన్ భవనం ఎదుట ధర్నా చేయనున్నట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 10న స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర క్యాబినెట్ సబ్ కమిటీ, 11న కేంద్ర క్యాబినెట్ సమావేశం ఢిల్లీలో జరగనుందని, ఈ సమావేశాల్లో ప్లాంట్ ప్రైవేటీకరించమని, పూర్తి సామర్థ్యంతో నడుపుతామని ప్రకటన చేయాలని కో రుతూ ఈ ధర్నా చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

కొత్త విమాన సర్వీసులపై హర్షం

గోపాలపట్నం, సెప్టెంబరు 8: విశాఖ విమానాశ్రయం నుంచి త్వరలో నాలుగు కొత్త విమాన సర్వీసులు ప్రారంభం కావడంపై ఏపీ ఎయిర్‌ట్రావెల్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. అసోసియేషన్ ప్రతినిధులు కుమార్ రాజా,డీఎస్ వర్మ, ఓ.నరేశ్ కుమార్ మాట్లాడుతూ, ఈ నెల 21న విశాఖ-హైదరాబాద్ విమాన సర్వీసు ప్రారంభం కానుందని తెలిపారు. అక్టోబరు 27న విజయవాడ-విశాఖ, విశాఖ-హైదరాబాద్ విమాన సర్వీసులతో పాటు విశాఖ-అహ్మదాబాద్ మధ్య వారంలో మూడు రోజులపాటునడిచే విమాన సర్వీసు ప్రారంభం కానున్నట్టు తెలిపారు.

వరద బాధితులకు గ్రామీణ వైద్యుల సంఘం చేయూత

వేపగుంట, సెప్టెంబరు 8: విజయవాడ వరదబాధితులకు ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకులు ముందుకువచ్చారు. వీరు పాతవస్త్రాలు, బియ్యం, మందులతో కూడిన కిట్లను నాయుడుతోట నుంచి ఆదివారం కార్లలో తరలించారు. ఈ కార్యక్రమంలో సంఘం జోనల్ నాయకులు జంగం జోషి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, మురళీకృష్ణ, సుగుణమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గురుద్వార్ నానక్ దర్బార్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

సింథియా, సెప్టెంబరు 8: షిప్‌యార్డు కాలనీలోని గురుద్వారక్ నానక్ దర్బార్ ను విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు గురువారం సందర్శించారు. దర్గాల్లో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్నారు.

టీడీపీ నేత శీరం పైడిరాజు వర్ధంతి

మల్కాపురం, సెప్టెంబరు 8 : టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ శీరం పైడిరాజు 6వ వర్ధంతి శ్రీహరిపురంలో ఆదివారం జరిగింది. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు పాల్గొని పైడిరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

తెరిపిలేని వర్షాలతో ప్రజలకు అగచాట్లు

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 8 : పూర్ణామార్కెట్ నుంచి కురుపాం మార్కెట్ వరకు ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. రెండు రోజులగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రహదారులపై వర్షం నీరు నిలిచిపోయింది. రోడ్డు విస్తరణ అసంపూర్తిగా మిగిలిపోవడం, కాలువల నిర్మాణం సక్రమంగా చేపట్టకపోవడం తదితర కారణాలు ఇప్పుడు ప్రజలకు ఇబ్బందులు మిగిల్చాయి.. టర్నర్ చౌల్ట్రీ నుంచి కాలువల నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో పాటు లోపల పెద్ద పైపులు అడ్డంగా వేయండతో చెత్త రోడ్డుపైకి చేరుతోంది. జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణ లోపం వల్ల వన్‌టౌన్ రోడ్డు విస్తరణతో పాటు కాలువ నిర్మాణం లోభూయిష్టంగా తయారయ్యిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పూర్ణామార్కెట్ వద్ద పాత కాలువలపై టైల్స్ వేయడంతో రోడ్డుపై వర్షం నీరు కాలువల్లోకి వెళ్లే అవకాశం లేకపోయిందని వ్యాపారులు చెబుతున్నారు. తమ వ్యాపార కూడలి వద్ద వర్షం కురిసినప్పుడు నీరు చేరుతుందని వాపోయారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారుల వైఫల్యంతోనే వన్‌టౌన్ పూర్తిగా జలమయంగా మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ చొరవ తీసుకుని పాతనగరంలో వర్షం నీటితో ఇబ్బందులు తొలగే చర్యలు తీసుకోవాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు.

సీతమ్మధార, సెప్టెంబరు 8: నగరంలోని కుండపోతగా కురుస్తున్న వర్షం కారణంగా సీతమ్మధారలో పలు రహదారుల్లో నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. వర్షపు నీటిలోనే వాహనదారులు ప్రయాణించవలసిన పరిస్థితి నెలకొంది. సీతమ్మధార ప్రధాన రహదారిలో అల్లూరి సీతారామరాజు విగ్రహం కూడలి రోడ్డు నుంచి పల్లపు ప్రాంతం కావడంతో వర్షపు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో ఇబ్బంది పడుతున్నారు. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూలు, బాలయేసు చర్చ్ వద్ద రోడ్డుపై పెద్దఎత్తున వర్షపు నీరు నిలిచిపోయింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 8 : భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. ఆదివారం సాయంత్రం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలవారు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. జనసైనికులు, కూటమి శ్రేణులు ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.


సీతమ్మధార ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు


పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిపై ఇలా..

నేడు అన్ని విద్యా సంస్థలకు సెలవు

మహారాణిపేట, సెప్టెంబరు 8: ప్రతికూల వాతావరణం, ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఈ నెల 9న విశాఖలోని ప్రభుత్వ ప్రయివేట్ యాజమాన్య పాఠశాలలకు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఇతర అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ప్రకటించారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసి జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కూడా సెలవు ప్రకటించింది.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

మహారాణిపేట: ఎడతెరిపిలేని వర్షాల కారణంగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

జీవీఎంసీలోనూ రద్దు

విశాఖపట్నం: జీవీఎంసీలో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ పి.సంపత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ఫిర్యాదులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. అయితే వాయుగుండం ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ఈ రద్దు నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజలంతా ఈవిషయాన్ని గమనించాలని వారు కోరారు.

మహిళను మోసగించాడనే అభియోగంతో వ్యక్తిపై కేసు నమోదు

కంచరపాలెం, సెప్టెంబరు 8: మహిళను లోబరుచుకుని మోసం చేశాడనే అభియోగంతో కంచరపాలెం పోలీసులు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భర్తతో విడాకులు తీసుకుని కైలాసపురంలో ఓ మహిళ కన్నవారి ఇంటి వద్ద నివాసం ఉంటోంది. ఈమెకు ఒక కుమార్తె ఉంది. గంగవరం ప్రాంతానికి చెందిన కొవిరి మాధవరావు నాలుగేళ్ల క్రితం ఆమెను పరిచయం చేసుకున్నాడు. ఒంటరిగా ఉండడం చూసి పెళ్లి చేసుకుంటానని లొంగదీసుకున్నాడు. ఆమె కుమార్తెకు ఉద్యోగం ఇప్పిస్తానంటూ బ్యాంకులో ఉన్న డబ్బును కూడా కాజేశాడు. మాధవరావుకు వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలుసుకున్న బాధితురాలు తన పెళ్లి విషయమై ఆరా తీసింది. ఈ తరుణంలో తనతో కలిసి ఉన్న వీడియోలు, ఫొటోలను అందరికీ పంపిస్తానంటూ మాధవరావు బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్. భాస్కరరావు నేతృత్వంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పలు రైళ్ల గమ్యం కుదింపు...రీ షెడ్యూల్

విశాఖపట్నం, సెప్టెంబరు 8: వాల్తేరు డివిజన్ పరిధిలోని పూండి-నౌపడ, తిలారు-కోటబొమ్మాళి సెక్షన్ల మధ్య భద్రత నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-పలాస మధ్య నడిచే 07470, 07471 నంబర్లు గల మెము రైళ్లు ఈ నెల 12 నుంచి 14 వరకు విశాఖ-శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య రాకపోకలు సాగిస్తాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు-పలాస మధ్య రాకపోకలు తాత్కాలికంగా రద్దు చేశామన్నారు. ఈ నెల 11న సాయంత్రం 6.50 గంటలకు పాండిచ్చేరిలో బయలుదేరాల్సిన పాండిచ్చేరి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (1289) రాత్రి 9.35 గంటలకు (రెండు గంటల 45 నిమిషాలు ఆలస్యంగా), అలాగే ఈ నెల 11, 13 తేదీల్లో మధ్యాహ్నం 1.40 గంటలకు కేఎస్ఆర్ బెంగుళూరులో బయలుదేరాల్సిన కేఎస్ఆర్ బెంగుళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464) సాయంత్రం 4.10 గంటలకు (రెండు గంటల 30 నిమిషాలు ఆలస్యంగా) బయలుదేరుతాయన్నారు.

మళ్లింపు మార్గంలో కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్

భారీ వర్షాల నేపథ్యంలో విశాఖ, కిరండోల్ మధ్య నడిచే నైట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా విశాఖ-కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18514) ఈ నెల 11 వరకు విజయనగరం, రాయగడ, కొరాపుట్ మీదుగానూ, తిరుగు ప్రయాణంలోని కిరండోల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18513) ఈ నెల 11వ తేదీ వరకు కొరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

నూతన భవనంలో చేపల విక్రయం

మహారాణిపేట, సెప్టెంబరు 8: ఫిషింగ్ హార్బర్‌లో నిర్మించిన నూతన భవనంలో చేపల విక్రయం ప్రారంభించారు, ఇంతకాలం ఆరుబయటనే చేపలు విక్రయించేవారు. సుమారు రూ.2.5 కోట్ల టాటా గ్రూప్ సీఎస్ఆర్ నిధులతో దీన్ని నిర్మించారు. సుమారు 150 మంది వ్యాపారులు చేపలు విక్రయించుకునే సౌలభ్యం ఉంది. ప్రతి బ్లాక్‌కు ప్రత్యేకంగా నీటి కుళాయి. లైట్లతో పాటు పలు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆదివారం నూతన భవనం ప్రారంభించడంతో చేపల వ్యాపారులకు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకపోయింది..


ఫిషింగ్ హార్బర్‌లో నిర్మించిన నూతన భవనంలో చేపల విక్రయం

బాలికలకు వ్యాక్సినేషన్ ప్రశంసనీయం

జగదాంబ కూడలి, సెప్టెంబరు 8 : గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం బాలికలకు ఉచితంగా వ్యాక్సినేషన్ సమకూర్చడం గొప్ప విషయమని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఏవీఎన్ కళాశాల వద్ద 37వ వార్డు సచివాలయంలో చైతన్య స్రవంతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. బాలికలు భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా చైతన్య స్రవంతి సేవా సంస్థ ఉచితంగా వ్యాక్సిన్ అందించడం ముదావహమని శ్రీనివాస్ కొనియాడారు. పేద కుటుంబాలకు తోడ్పాటు అందిస్తున్న సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ కృషి అభినందనీయమన్నారు. డాక్టర్ షిరీన్ మాట్లాడుతూ 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు ఈ వ్యాక్సిన్ వేయడం వల్ల యుక్తవయస్సు నాటికి క్యాన్సర్ బారిన పడరన్నారు. కేజీహెచ్ రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి మాట్లాడుతూ ప్రస్తుతం బూస్టర్ డోస్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఏరియా బిజినెస్ మేనేజర్ బి.రామ్‌రతన్, సేవా సంస్థ ప్రతినిధులు రుకియాభాను, విజయకుమారి, అనసూయ, రోజా, లక్ష్మీదేవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


బాలికకు టీకా వేస్తున్న డాక్టర్ షిరీన్ రహమాన్, చిత్రంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ


మురళీనగర్ బృందావన్ పార్కు వద్ద బుద్ధి, సిద్ధి వినాయకస్వామి కల్యాణ ఉత్సవంలో కమిటీ సభ్యులు

వైభవంగా వినాయక ఉత్సవాలు

మురళీనగర్/ అక్కయ్యపాలెం/ సీతమ్మధార: నగరంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆదివారం వర్షం కురుస్తున్నా ప్రజలు మండపాల వద్దకు వెళ్లి దర్శించుకున్నారు. సీతంపేటలోని దుర్గాగణపతిని బంగారు, వెండి అభరణాలు, పూలదండలతో అలంకరించారు. అన్ని ప్రాంతాల్లో కొలువుదీరిన మండపాల వద్ద వినాయకుడికి హోమం, అభిషేకాలు, పూజలు చేశారు. పూర్ణామార్కెట్, డాబాగార్డెన్స్, అక్కయ్యపాలెం, మురళీనగర్, జ్ఞానాపురం, కాన్వెంట్ జంక్షన్ ప్రాంతాల్లో అంగరంగ వైభవంగా ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

వక్ఫ్ చట్టం సవరణకు డిమాండ్

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 8 : కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్టాన్ని (2024) సవరించాలని ముస్లిం నాయకులు డిమాండ్ చేశారు. దొండపర్తిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో అఖిలపక్ష చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం కమ్యూనిటీ నాయకుడు షేక్ అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ సవరణ చట్టం ద్వారా తమ పూర్వీకుల ఆస్తులపై హక్కులు లేకుండా చేయడం బాధాకరంగా ఉందన్నారు. 11వ శతాబ్దంలో సుల్తాన్, మొగల్ చక్రవర్తులు, ప్రస్తుతం ధనికుల ఇళ్ల స్థలాలు అల్లాహ్ పేరున వక్ఫ్(దానం) చేశారని గుర్తు చేశారు. వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చిన ఆదాయం పేద ముస్లింలు, వితంతువులు, అనాథలు, పేద విద్యార్థుల చదువులకు, మసీదులు, దర్గాలు, ఖబరస్తాన్లు, సరాయి సత్రాల అభివృద్ధికి ఖర్చు చేయవలసి ఉందని వివరించారు. సెంట్రల్ వక్ఫ్ బోర్డుకు 9,40,000 ఎకరాల ఆస్తి ఉండగా, వీటి ద్వారా వస్తున్న ఆదాయం రూ.8.7 లక్షలు మాత్రమేనన్నారు. కొన్ని వేల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని చెప్పారు. ఈ బిల్లును పార్లమెంటులో విపక్షాలు వ్యతిరేకించడంతో 31 మంది ఎంపీలతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారన్నారు. ఈ సమావేశంలో విపక్ష నాయకులు అజశర్మ, లక్ష్మి, కత్తి పద్మ, అష్రాఫ్, హైదరాలి సింకా తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన విపక్ష నాయకులు

పోలీస్ కమిషనర్ మానవత

ఎం.వి.పి.కాలనీ, సెప్టెంబరు 8 : వినాయకచవితి సందర్భంగా నగరంలో పర్యటిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఓ సంఘటనలో తన మానవత్వం చాటుకున్నారు. శనివారం రాత్రి చవితి పందిర్లు, నిమజ్జన ప్రాంతాల పరిశీలనకు వెళ్తుండగా ఎం.వి.పి. కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాసన్స్‌బే కాలనీ వద్ద ఒంటిపై దుస్తులు సమకూర్చి ఏదో ఒక స్వచ్ఛంద సంస్థ ఆశ్రమంలో చేర్పించమని ఆదేశించారు. అనంతరం ఫొటోలతో సహా తన వాట్సాప్‌కు పంపించమని సూచించారు. ఎం.వి.పి. పోలీసులు తగిన చర్యలు తీసుకుని, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అప్పగించారు.


మతిస్థిమితం లేని వ్యక్తిని ఆశ్రమంలో చేర్పిస్తున్న పోలీసుల

ఆర్టీసీకి వరుణుడి దెబ్బ

... 5వ పేజీ తరువాయి

డిపో నుంచి ఎనిమిది, వాల్తేరు డిపో నుంచి 15, మద్దిలపాలెం డిపో నుంచి 13, విశాఖ నుంచి పది, గాజువాక నుంచి 15, సింహాచలం డిపో నుంచి 12, స్టీల్ సిటీ డిపో నుంచి ఏడు బస్సులను రద్దు చేశారు. జిల్లాలో డిమాండ్ లేని రూట్లలో బస్సులను రద్దు చేసినట్టు అధికారులు ప్రకటించారు. కాగా ఆర్టీసీ విశాఖ రీజియన్ గత నెల సగటు ఆక్యుపెన్సీ రేషియో 72 శాతంగా, రోజువారి సగటు ఆదాయం కోటి రూపాయలుగా నమోదైంది. కాగా ఈ నెల ఐదున 58 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదై రూ.64 లక్షల ఆదాయం వచ్చింది. ఆరో తేదీన 65 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదై రూ.68 లక్షల ఆదాయం, శనివారం 50 శాతం ఆక్యుపెన్సీ నమోదై రూ.60 లక్షలు, ఆదివారం 50 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదై రూ.60లక్షలు ఆదాయం వచ్చింది. ఈ నాలుగు రోజుల్లో రూ.నాలుగు కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా, రూ.2.52 కోట్లు మాత్రమే వచ్చింది. రూ.1.48 కోట్ల ఆదాయానికి గండి పడింది.

జిల్లా యంత్రాంగం అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఈ మేరకు పద్మనాభం, భీమిలి తహసీల్దార్లను అప్రమత్తం చేశారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం 55 అడుగులకు చేరగా, ఇన్‌ఫ్లో 477 క్యూసెక్కులగా ఉంది. సోమవారం ఉదయం ఒక గేటు ఎత్తి వేయనున్నట్టు అధికారులు తెలిపారు. వర్షాల నేపథ్యంలో అన్ని విభాగాలను అప్రమత్తంచేశామని డీఆర్‌వో కె.మోహన్‌కుమార్ తెలిపారు.

శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు తహసీల్దార్ కార్యాలయాల్లోని రెయిన్ గేజ్‌ల వద్ద రికార్డు అయిన వివరాలను పరిశీలిస్తే.. అత్యధికంగా భీమిలిలో 87 మి.మీ. వర్షపాతం నమోదైంది. మహారాణిపేటలో 74.4, సీతమ్మధారలో 72.6, ఆనందపురంలో 68.6, విశాఖపట్నం రూరల్‌లో 66.4, పెదగంట్యాడలో 55.8, పద్మనాభంలో 53.6, గోపాలపట్నంలో 52.4, ములగాడలో 48.6, గాజువాకలో 45.8, పెందుర్తిలో 42.8 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏపీఎస్‌డీపీఎస్ ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌లో పెందుర్తిలో 59.75, గోపాలపట్నంలో 59.25, మదీనాబాగ్‌లో 59.0, గంభీరంలో 57.5, ఎయిర్‌పోర్టులో 57.2 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అంటే శనివారం నుంచి ఆదివారం వరకు పలుచోట్ల సగటున పది సెంటీ మీటర్ల కంటే ఎక్కువగా వర్షపాతం నమోదైంది.

'ఆలయం' చలన చిత్రం షూటింగ్ ప్రారంభం


జగదాంబ కూడలి, సెప్టెంబరు 8 : వన్‌టౌన్ కనకమహాలక్ష్మి దేవస్థానం ప్రాంగణంలో ఆలయం చలనచిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం సందడిగా జరిగింది. ఆదివారం ఉదయం అమ్మవారి సన్నిధిలో జరిగిన ముహూర్తపు సన్నివేశంలో చిత్ర కథానాయికపై ఎమ్మెల్యే వంశీకృష్ణ క్లాప్ కొట్టారు. చిత్ర దర్శకురాలు రోహిణి విలేకరులతో మాట్లాడుతూ విశాఖ, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతామన్నారు. కొత్త నటీనటులతో చిత్రం తెరకెక్కుతుందని వివరించారు. అమ్మవారికి చిత్రయూనిట్‌తో పాటు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. అర్చకులు అమ్మవారి సన్నిధిలో అభిషేకాలు, కుంకుమ పూజలు ఆయనతో జరిపించారు. జేఈవో వి.రాంబాబు అమ్మవారి ప్రసాదాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

మల్కాపురం, సెప్టెంబరు 8: శ్రీహరిపురం జీవీఎంసీ మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుకనున్న హాకర్‌జోన్‌లో జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అప్పలనాయుడు మృతి చెందారు. అతను 59వ వార్డులో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులతో విభేదాలతో గత కొంతకాలంగా హాకర్‌జోన్‌లోనే గడుపుతున్నారు. అయితే, వారం రోజులుగా ఆరోగ్యం బాగాలేదు. ఈ స్థితిలో ఆయన మృతి చెందినట్టు భా విస్తున్నారు. అప్పలనాయుడు మృతి చెందిన విషయాన్ని స్థానికులు కొంతమంది గుర్తించి మల్కాపురం పోలీసులకు తెలిపారు. సీఐ విద్యసాగర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతుని వివరాలను సేకరించారు. ఈ లోగా మృతుడి బంధువులు వచ్చారు. పోలీసులు ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు.

ద్వారకా సీఐ బాధ్యతల స్వీకరణ

సీతంపేట, సెప్టెంబరు 8: ద్వారకా పోలీసు స్టేషన్ సీఐగా డి.వెంకటరమణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పూర్వ సీఐ రమేష్ మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ వెంకటరమణ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు హద్దు మీరితే చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతలు కాపాడతామన్నారు.


వెంకటరమణ

కుంభవృష్టి

... 5వ పేజీ తరువాయి

పాత నగరం వైపు పోటెత్తింది. దీంతో పాత నగరంలోని రహదారుల్లో మోకాలు లోతు నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్లపై నిలిచిన నీరు డ్రైనేజీల్లోకి చేరేలా ఏర్పాటు చేసిన రంధ్రాలు ప్లాస్టిక్ వ్యర్థాలతో మూసుకుపోవడంతో స్థానికులే వాటిని తొలగించి నీరు కాలువల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. వారం రోజులు కిందట కురిసిన వర్షాలకు తడిచిముద్దయిన భవనాలు, కొండవాలు ప్రాంతాలు తాజాగా కురుస్తున్న వర్షాలకు మరింత నానిపోయాయి. దీంతో పురాతన భవనాలు, ప్రహరీలు కూలిపోతుండగా, కొండవాలు ప్రాంతాల్లో రాళ్లు జారిపడుతున్నాయి. గోపాలపట్నంలోని రామకృష్ణానగర్‌లో భారీ కొండచరియ పడడంతో ఇళ్లకు ముప్పు ఏర్పడింది. గంగవరంలోని బడివీధిలో ఉన్న పురాతన పెంకుటిల్లు పైకప్పు కూలిపోయింది. అందులో ఎవరూ నివాసం లేనందున ప్రాణ నష్టం తప్పింది. గవర కంచరపాలెంలో రైల్వే ప్రహరీ కూలి పక్కనే ఉన్న రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలపై అవి పాక్షికంగా దెబ్బతిన్నాయి. సీబీఎం కాంపౌండ్‌లో ఒక అపార్ట్‌మెంట్ ప్రహరీ కూలిపోయింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. హెచ్‌బీకాలనీలోని నర్సింహనగరంలో కొండవాలు రక్షణ గోడ కూలిపోయింది. ఆనందపురం ఉన్నత పాఠశాల ప్రహరీ కూలి పక్కనే ఉన్న ఇంటిపై పడిపోయింది. అయితే అధికారులు ముందు జాగ్రత్తగా ఆ ఇంట్లో వారిని పునరావాసకేంద్రానికి తరలించారు. సీపీ శంఖబ్రత బాగ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కైలాసపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రహరీ వర్షానికి కూలి రోడ్డుపై పడింది. అయితే ఎవరికీ ఏమీ కాలేదు. పద్మనాభం మండలం పొట్నూరులో నూకాంబిక చెరువు నిండిపోవడంతో మిగులు జలాలు పారే దుమ్మురి గెడ్డ వేగంగా ప్రవహించడంతో గ్రామంలోకి వెళ్లే కాజువే మీదుగా పెద్దఎత్తున నీరు ప్రవహిస్తుంది. దీంతో విజయగనరం జిల్లా జామి మండలం బలరాంపురానికి చెందిన వ్యక్తి ప్రవాహంలో కొట్టుకుపోవడంతో స్థానికులు తాడు సహాయంతో రక్షించారు. అలాగే మండలంలో చెరువు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కొన్ని పంట పొలాలు నీట మునిగాయి.

వర్ష తీవ్రతపై సీఎం చంద్రబాబు ఆరా

కుండపోత వర్షాలపై సీఎం చంద్రబాబునాయుడు ఆదివారం ఆరా తీశారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌తో టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వర్షాల తీవ్రత, ముందస్తుచర్యలను కమిషనర్ సీఎంకు వివరించారు. ముప్పు ఉన్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామని, ఆయా ప్రాంతాల్లోని నివాసితులను అప్రమత్తం చేశామని వివరించారు. 80 చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, అందులో 10,620 మందిని ఉంచేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. గోపాలపట్నంలో కొండచరియ పడిన ఘటనకు సంబంధించి ఐదు కుటుంబాలతోపాటు వారి నివాసాలకు సమీపంలో ఉన్న మరో 20 కుటుంబాలను కూడా పునరావాస కేంద్రానికి తరలించినట్టు చంద్రబాబుకు వివరించారు. ముప్పు ఉన్న ప్రాంతాల వారిని ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ప్రాణ నష్టం లేకుండా చూడాలని కమిషనర్‌కు సీఎం ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించిన మేయర్

భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆదివారం పర్యవేక్షించారు. జోన్-3, జోన్-5లోని ప్రధాన గెడ్డలు పొంగి ప్రవహిస్తుండడంతో అధికారులతో కలిసి ఆయా గెడ్డలు సముద్రంలో కలిసే చోటకు వెళ్లి పరిశీలించారు. ఎర్రిగెడ్డలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు భారీగా వస్తుండడంతో వాటిని నిరంతరం జేసీబీలతో తొలగించి నీటి ప్రవాహం సజావుగా సాగేలా పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పెదజాలారిపేట బీచ్‌లో వినాయక నిమజ్జనాలు జరిగే చోటును పరిశీలించి, ఇక్కడి వ్యర్థాలను తొలగించాలని సూచించారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్లారు. అక్కడ చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్‌తో కలిసి నగరంలోని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు సంబంధించి ప్రజల నుంచి జీవీఎంసీ కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మేయర్ వెంట ఏడీసీ రమణమూర్తి, ఎస్ఈ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

ముప్పు ముంగిట కొండవాలు ప్రాంతాలు

... 5వ పేజీ తరువాయి

పడినా ఎక్కడో ఒకచోట కొండచరియలు విరిగిపడడం, మట్టిపెళ్లలు జారి ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారిం ది. ఎనిమిదేళ్ల కిందట భారీ వర్షం కారణంగా కైలాసపురంలో రాత్రివేళ కొండచరియ విరిగిదిగువ నున్నఇంటిపై పడడంతో ముగ్గురు మృతి చెందారు. చాలాచోట్ల కొండవాలు ప్రాంతాల్లోని నివాసాలకు రక్షణగా గోడలు లేకపోవడం ప్రమాదానికి కారణంగా మారుతున్నాయి. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నందున భారీ వర్షాల సమయంలో అధికారులు ముందు జాగ్రత్తగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తుండడంతో ప్రాణనష్టం వాటిల్లడం లేదు. అంతేగానీ రక్షణ గోడల నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. అంతకుముందు కూడా అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల పాటు విస్తారమైన వర్షాలు పడ్డాయి. దీనివల్ల కొండవాలు ప్రాంతాలన్నీ బాగా నానిపోవడంతో క్రమేపీ కుంగుతున్నాయి. ఈ క్రమంలో రాళ్లు విరిగిపడడం, మట్టిరియలు జారిపోవడం జరుగుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని భవనాలు, ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఏర్పడుతోంది. రెండు రోజుల కిందట భారీ వర్షానికి హనుమంతవాక వద్ద కొండవాలులోని ఓ బండరాయి జారి జాతీయ రహదారిపై పడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తాజాగా గోపాలపట్నం రామకృష్ణానగర్ వద్ద కొండచరియ విరిగిపడడంతో ఐదు భవనాల కింద మట్టి కోతకు గురైంది. ఇందులో ఒక భవనం గాల్లోనే వేలాడుతోంది. ఏ క్షణమైనా ఐదు భవనాలు కూలిపోయే ప్రమాదం ఉందని జీవీఎంసీ, పోలీస్ అధికారులు గుర్తించి అందులో ఉంటున్న వారిని ఖాళీ చేయించి లక్ష్మీనగర్‌లోని పునరావాస కేంద్రానికి తరలించారు. అదేవిధంగా బీచ్ రోడ్డులో సీతకొండ నుంచి రాళ్లు జారి కిందకు పడుతున్నాయి. ఆదివారం ఉదయం కొన్ని రాళ్లు బీచ్ రోడ్డుపైకి దూసుకురావడంతో జీవీఎంసీ, పోలీస్ అధికారులు అప్రమత్తమై ముందు జాగ్రత్తగా కొండ వైపు ఉన్న రోడ్డును మూసివేశారు.

కొండవాలులో 14,431 కుటుంబాలు

నగరంలోని కొండవాలు ప్రాంతాల్లో నివాసాలు, ప్రమాదం ముంగిట ఉన్న ప్రాంతాలపై జీవీఎంసీ, రెవెన్యూశాఖ అధికారులు సంయుక్తంగా ఈ నెల రెండున సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ పరిధిలో కొండవాలు ప్రాంతాల్లో 135 కాలనీలు ఉన్నట్టు గుర్తించారు. ఇందులో 14,431 కుటుంబాలు నివాసం ఉంటున్నట్టు తేలింది. కొండవాలులో ఉన్న కాలనీల్లో అనకాపల్లి జోన్‌లోని ఇందరమ్మ కాలనీ, బీసీ కాలనీ-1, బీసీ కాలనీ-2, పాస్టర్ కాలనీతో పాటు జోన్-2 పరిధిలోని హనుమంతవాక కాలనీలు తీవ్రమైన ప్రమాదం ముంగిట ఉన్నట్టు గుర్తించారు. ఈ ఐదు కాలనీల్లో 249 కుటుంబాలు నివసిస్తున్నాయని,వీరందరినీ ప్రత్యామ్నాయ స్థలాలకు తరలించడం ద్వారా భవిష్యత్తులో ప్రాణ నష్టాన్ని నివారించవచ్చునని అధికారులు అభిప్రాయ పడ్డారు. కొండవాలులో ఉన్న కాలనీల్లో మధ్యస్థ ప్రమాదం ముంగిట 89 కాలనీలు ఉన్నట్టు గుర్తించారు. అంతేకాకుండా కొండవాలులోని 73 కాలనీలకు రక్షణ గోడలు లేవని సర్వే ద్వారా అధికారులు తేల్చారు.

ప్రజలను అప్రమత్తం చేశాం

భారీ వర్షాల నేపథ్యంలో కొండవాలు ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలను అప్రమత్తం చేశాం. ముప్పు ఉందని గుర్తించిన ఇళ్లల్లోని వారిని ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు/పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు చేపట్టాం. జోన్‌ల వారీగా ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నాం. జోనల్ కమిషనర్లు, యూసీడీ, ఇంజనీరింగ్ అధికారులంతా సమష్టిగా పనిచేస్తూ ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రణాళికను అమలు చేస్తున్నారు. పోలీస్, రెవెన్యూశాఖలతో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు ప్రజలకు సమచారం అందజేస్తున్నాం. కొండవాలు ప్రాంతాల్లో శాశ్వత రక్షణ కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ రూపొందించేందుకు రెవెన్యూ శాఖతో కలిసి ఇటీవలే కొండవాలు ప్రాంతాల్లో అధ్యయనం చేశాం.

-పి.సంపత్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్

సంపత్ వినాయగర్ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



సిరిపురం, సెప్టెంబరు 8 : సిరిపురంలోని సంపత్ వినాయగర్ దేవాలయంలో వినాయక చవితి వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున 3 గంటల నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో బారులు తీరారు. తొలి రోజు సంపత్ వినాయగర్ అవతారంలో స్వామివారు దర్శనమిచ్చారు.ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామిని దర్శించుకుని భక్తులు పరవశించిపోయారు. ఉదయం 4 నుంచి 6 వరకు గణపతి హోమం, 7 నుంచి 11 వరకు నాదస్వర కచేరి, 7 నుంచి 10 వరకు ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ఆవరణలో నారాయణ సేవ చేపట్టారు. స్వామివారిని ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు, ఇతర ప్రముఖులు దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శిరీష, ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్ టి.ఆర్.చోళన్, దేవాలయ సిబ్బంది జి. గోవిందరెడ్డి పర్యవేక్షించారు. కాగా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బాలగణపతిగా స్వామివారు దర్శనమిచ్చారు. రెండవ రోజు కూడా భక్తులు స్వామివారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

కొమ్మాది, సెప్టెంబరు 8 : చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు నార్త్ జోన్ క్రైమ్ పోలీసులు తెలిపారు. ఈమేరకు పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌లో నార్త్ జోన్ క్రైమ్ ఏసీపీ వెంకటరావు ఆదివారం వివరాలు వెల్లడించారు. మాకిరెడ్డి సీతామహాలక్ష్మి పీఎంపాలెంలో నివాసం ఉంటుంది. ఆమె వారం రోజుల క్రితం తన సొంతూరు వాడపాలెం వెళ్లి ఈనెల 6న తిరిగి విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుని అక్కడి నుంచి ఆశీలుమెట్ట జంక్షన్ వరకు షేర్ ఆటోలో ప్రయాణించింది. ఆ సమయంలో ఆమెతో పాటు మరో ముగ్గురు మహిళలు ఆటోలో ప్రయాణించారు. ఆమె ఆశీలుమెట్టలో ఆటో దిగి మరో ఆటోలో పీఎంపాలెంలోని తన ఇంటికి చేరుకుని హ్యాండ్ బ్యాగ్ చూసుకోగా బ్యాగులోని ఆరున్నర తులాల బంగారం వస్తువులు, రూ. 50 వేల నగదు కనిపించలేదు. ఈమేరకు పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితురాలిని గుర్తించి ఆమె వద్ద నుంచి బంగారం వస్తువులు, నగదు రికవరీ చేశారు.

బంగారం చోరీ చేసిన యువకుడి అరెస్టు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 8 : ఏసీ బాగుచేయడానికి వచ్చి, ఇంట్లోని బంగారు వస్తువులు చోరీ చేసిన నిందితుడ్ని ఎంవీపీ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు ఏసీపీ వెంకటరావు, ద్వారకా క్రైమ్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు మేరకు.. రుషికొండలోని ఓ కళాశాలలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్న పూర్ణా మార్కెట్ రంగిరీజు వీధికి చెందిన నందవరపు చాణిక్య (21) ఖాళీ సమయాల్లో రాపిడో సర్వీస్‌తో పాటు ఏసీలు రిపేర్ చేస్తుంటాడు. ఈమేరకు ఈనెల 3న సీతమ్మధార ప్రాంతానికి చెందిన కొండు ఉదయ లక్ష్మీ ఇంట్లో ఏసీ చేయడానికి వెళ్లాడు. రిపేరు కోసం వెళ్లిన నిందితుడు ఇంట్లో ఓ బ్యాగులో ఉన్న నల్లపూసల గొలుసు, బ్రాస్‌లెట్, గాజులు, రింగులు, వజ్రాల గోల్డ్ స్టడ్స్, ఉంగరాలు, ఇలా సుమారు 2.12 లక్షల రూపాయల విలువైన బంగారు నగలను చోరీ చేశాడు. బాధితురాలు ఫిర్యాదు చేసిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు చాకచక్యంగా యువకుడ్ని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి మొత్తం నగలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో చురుగ్గా వ్యవహరించిన ఎంవీపీ నేర విభాగం పోలీసులను సీపీ అభినందించారు.

అప్పన్న సన్నిధిలో స్వాతి నక్షత్ర హవనం

సింహాచలం, సెప్టెంబరు 8 : అప్పన్న సన్నిధిలో స్వాతి నక్షత్ర హవనం ఆదివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. యజ్ఞకర్తగా సుదర్శన పెరుమాళ్‌ను పల్లకిలో ఉంచి కల్యాణ మండపంలో అధిష్ఠింపజేశారు. మండపారాధన, కలశారాధన, బింబారాధన జరిపిన అనంతరం హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేశారు.



తగరపువలస సర్వీసు రోడ్డు అండర్ పాత్ వంతెన వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



తగరపువలస : జలమయమైన కుడి వైపు సర్వీసు రోడ్డు



పద్మనాభం : బుడ్డివలసలో కూలిన శిథిలమైన పాఠశాల భవనం

జన జీవనానికి వాయు గండం

- విస్తారంగా కురుస్తున్న వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తం
- పొంగుతున్న గెడ్డలు, వాగులు
- ఉధృతంగా గోస్తనీ నది
- పరివాహక ప్రాంతాల్లో భయం భయం
- జలమయమైన తగరపువలస సర్వీసు రోడ్డు
- పలుచోట్ల కూలిన గోడలు



ఆనందపురం : ఉధృతంగా గంభీరం జలాశయం

భీమునిపట్నం, సెప్టెంబరు 8 : ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు జన జీవనం స్తంభించింది. అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. భారీ వర్షాల నేపథ్యంలో భీమిలి ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి 3వ వార్డులో ఉప్పుటేరును ఆనుకుని వున్న తోటవీధిని సందర్శించి, ప్రజలను అప్రమత్తం చేశారు.

పద్మనాభం : మండలంలోని వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. విజయరాంపురం, మద్ది మీదుగా ప్రవహించే ఇసుకగెడ్డ, పొట్నూరులోని దుమ్మురి గెడ్డ, రెడ్డిపల్లి-కోరాడ, కోరాడ-గెడ్డపేట, బీఆర్ తాళ్లవలస - అయినాడ రోడ్లలోని గెడ్డలు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. విజయగనరం జిల్లా జామి మండలం బలరాంపురం గ్రామానికి చెందిన వ్యక్తి ప్రవాహంలో కొట్టుకుపోవడంతో స్థానికులు తాడుతో రక్షించారు. ఇదే గ్రామంలో గొలగాని వాని కళ్లాలకు వెళ్లే రోడ్డు గెడ్డ ప్రవాహానికి ముంపునకు గురవ్వడంతో 50 కుటుంబాలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

ఉధృతంగా గోస్తనీ నది

గోస్తనీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో శాసనాపల్లి, కృష్ణాపురం, దివాన్నీ, కుప్రపల్లి, పోలిపల్లి ఆనకట్ట పూర్తిగా నీటితో నిండి ప్రవహిస్తున్నాయి. దీంతో వీటికి అనుబంధంగా ఉన్న ఏటికాలువలు కూడా నిండుగా ప్రవహిస్తున్నాయి.దీంతో కాలువలకు గండ్లు పడతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తాటిపూడి రిజర్వాయరు నీటి మట్టం పెరగడంతో మూడు గేట్ల ద్వారా 350 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. దీంతో గోస్తనీ నదిలో వరదనీటి ఉధృతి పెరిగి చెరువులకు, కాలువలకు గండ్లు పడతాయేమోనని ప్రజలు భయందోళన చెందుతున్నారు.

జల దిగ్బంధంలో సబ్బివానిపేట

తగరపువలస : జాతీయ రహదారి పక్కనున్న సబ్బివానిపేట ప్రధాన రహదారి కూడా జలమయమైంది. గ్రామం మొత్తమ్మీద ఒకే ఒక కాలువ ఉండడంతో పరిసర ప్రాంతాల నీరంతా దాని ద్వారానే ప్రవహిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామం అంతా జలమయమైంది. ఈ గ్రామానికి వెళ్లడానికి జాతీయ రహదారి నుంచి ప్రధాన రహదారి ఉంది. ఈ రహదారి నీటి ప్రవాహంతో కాలువ మాదిరిగా మారింది. దీంతో ఇతరులు ఈ గ్రామంలోకి వెళ్లడానికి, ఈ గ్రామస్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి అవకాశం లేకుండాపోయింది.

అధికారులతో గంటా సమావేశం

తగరపువలస, సంగివలస మధ్య ఉన్న సర్వీసు రోడ్డులో నీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. ఆదివారం ఆయన సర్వీసు రోడ్డును అండర్ పాత్ వంతెన కింద నుంచి పరిశీలించారు. స్థానికులు నీటి వల్ల ఎదురవుతున్న ఇబ్బం దులను ఆయనకు తెలియజేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ త్వరలోనే హైవే అథారిటీ, ఇరిగేషన్, జీవీఎంసీ అధికారులతో సంయుక్తంగా సమావేశం ఏర్పాటు చేసి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూస్తానన్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ గోడ

ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలింది. ఈ సంఘటనలో గోడకు ఆను కుని ఉన్న బైక్, స్కూటీ, రిక్షాపై పూర్తిగా ధ్వంసమయ్యాయి. అదే సమయంలో విద్యుత్ వైర్లు కూడా తెగి పడడంతో ఆ శాఖ సిబ్బంది తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మ తులు చేపట్టారు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. దెబ్బతిన్న రెండు బైక్‌లు, రిక్షాకు నష్ట పరిహారం అందేలా చూడాలని తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్‌ను ఆదేశించారు.

అల్లకల్లోలంగా సముద్రం

సాగర్‌నగర్ : సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు సాధారణ స్థాయి కంటే ఎక్కువ ఎత్తులో ఎగసి పడుతున్నాయి. మరోవైపు భారీ వర్షాలకు తీర ప్రాంత ప్రజలు హడలిపోతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి.పెద్ద రుషికొండ కూడలిలో బీచ్ రోడ్డుపై నీరు చేరడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. సాగర్‌నగర్ నుంచి ఎండాడ దసపల్లా లేఅవుట్‌కు వెళ్లే రహదారిపై భారీగా నీరు చేరింది.

అప్రమత్తంగా ఉండండి : వెలగపూడి

విశాఖపట్నం : నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. ఆదివారం రాత్రి ఆయన కొండవాలు ప్రాంతాలకు చెందిన నాయకులతో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. అలాగే జీవీఎంసీ అధికారులను అప్రమత్తం చేస్తూ వారికి పలు సూచనలు చేశారు.



భీమిలి : తోటవీధిలో ఉప్పుటేరు పరిస్థితిని పరిశీలించిన జడ్పీ కనక మహాలక్ష్మి



భీమిలిలో మినీ స్టేడియం వద్ద రహదారిపై పారుతున్న నీరు



15వ వార్డు నరసింహనగర్‌లో జారి పడిన రక్షణ గోడ



తాటిపూడి జలాశయం గేట్లు నుంచి విడుదల చేసిన నీరు



భీమిలి తోటవీధిలో స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీవో భాస్కర్‌రెడ్డి



సింహాచలం : నీటితో కళకళలాడుతున్న పుష్కరిణి



మద్ది దివాన్నీ ఆనకట్టు మీదుగా ప్రవహిస్తున్న గోస్తనీ నది



సత్యన్నారాయణపేటలో ఆదివారం రాత్రి పదిన్నర గంటల ప్రాంతంలో కొండపై నుంచి రాళ్లు జారి పడడంతో ప్రజలు ఆందోళన చెందారు. కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి, భీమిలి ఆర్ఐ మల్లేశ్వరరావు, సీఐ సుధాకర్ సంఘటనా స్థలికి వెళ్లి అక్కడ ఉన్న 20 కుటుంబాలకు జీవీఎంసీ గ్రంథాలయంలో పునరావాసం కల్పించారు.

- తగరపువలస/ఆంధ్రజ్యోతి

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తం : కమిషనర్

వెంకోజీపాలెం, సెప్టెంబరు 8 : భారీ వర్షాల నేపథ్యంలో కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం ఆయన విజయవాడ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో భారీ వర్షం కురిసిందని,ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే వార్డుల్లో పర్యటించి, కొండవాలు, లోతట్టు, ముంపు గురైన ప్రాంతాలను గుర్తించాలని చెప్పారు. కొండవాలు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ వారిని సమీపంలో ఉన్న పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు రోడ్లపై, వీధుల్లో చెట్లు విరిగిపడే అవకాశాలు ఉన్నందున వాటిని వెంటనే తొలగించాలని, విద్యుత్ లైట్ల మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

కొండపై జారి పడిన రిటైనింగ్ వాల్

వెంకోజీపాలెం/ఆరిలోవ, సెప్టెంబరు 8 : జీవీఎంసీ 15వ వార్డులోని నరసింహనగర్ కొండవాలు ప్రాంతంలో రక్షణ గోడ జారిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గోడ పడిపోవడంతో పైన ఇళ్లు ప్రమాదకర స్థితికి చేరాయి. పైన, కింద ఇళ్లు ఉన్న వారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. అలాగే హనుమంతువాక జంక్షన్ పండ్ల దుకాణాల సమీపంలో పెద్ద బండరాయి కొండ పైనుంచి కిందకు జారింది. ఆ సమయలో వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

పద్మనాభం, సెప్టెంబరు 8 : తాగిన మైకంలో ఓ వ్యక్తి డ్రైనేజీలో పడి మృతి చెందాడు. పద్మనాభం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బాందేవుపురం పంచాయతీ విజయరాంపురంలో ఈనెల 7న రాత్రి బొడ్డు సూర్యనారాయణ (73) తన ఇంటికి వెళ్లే క్రమంలో డ్రైనేజీలో పడిపోయాడు. వెంటనే స్థానికులు 108 వాహనంలో విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన ఎంఎల్‌సీ నివేదిక మేరకు సీఐ సీహెచ్ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణేశ్ నిమజ్జనాలకు జీవీఎంసీ ఏర్పాట్లు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 8 : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తీర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడానికి జీవీఎంసీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేసినట్టు ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, అదనపు కమిషనర్ రమణమూర్తి తెలిపారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 1, 2,3,4,6,7 జోన్లలో ఉన్న తీరంలో ఈనెల 17 వరకు 13 చోట్ల నిమజ్జనాలకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

వినాయక మండపాలకు రూ.2.5 లక్షల విరాళం



వాంబే కాలనీలో గణేశ్ ప్రతిమ వద్ద పిల్లా మంగమ్మ, వెంకటరావు

మధురవాడ: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ,టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు వార్డు పరిధిలో పలుచోట్ల ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాలకు రూ. 2.5 లక్షల విరాళాలు అందించారు. శనివారం వారు వాంబే కాలనీ, స్వతంత్రనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించి గణేష్ ప్రతిమలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శంకర్, పోతిన నాయుడు, పీవీఎస్ఎన్ బాలాజీ, ఎం. రాము, కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.